http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

గురువారం 11 జూన్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828




## నకిలీ నంబర్ ప్లేట్ వాడితే జైలుకే

- చలాన్‌ల నుంచి తప్పించుకునే ఉద్దేశంతో నకిలీ నంబర్ ప్లేట్ వాడకం
- సంగారెడ్డిలో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- నెంబర్ ప్లేట్లు మార్చితే జైలుకు వెళ్తారని హెచ్చరిక
- సంగారెడ్డిలో నకిలీ నంబర్ ప్లేట్ గుర్తింపు

# ఇదే 'ఫ్యూచర్'

- గ్రీన్‌ఫార్మా, స్పోర్ట్స్, హెల్త్, ఎడ్యుకేషనల్, డేటా సెంటర్లతో విరాజిల్లబోతోంది
- టోక్యో, సింగపూర్, న్యూయార్క్ వంటి గొప్ప నగరాలతో పోటీ పడబోతోంది
- ఎఫ్‌సీడీఏ కార్యాలయ భవనం ప్రారంకోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- గ్రీన్‌ఫార్మా, స్పోర్ట్స్, హెల్త్, ఎడ్యుకేషనల్, డేటా సెంటర్లతో విరాజిల్లబోతోంది
- టోక్యో, సింగపూర్, న్యూయార్క్ వంటి గొప్ప నగరాలతో పోటీ పడబోతోంది
- ఎఫ్‌సీడీఏ కార్యాలయ భవనం ప్రారంభోత్సవ సభలో సీఎం రేవంత్‌రెడ్డి




రంగారెడ్డి

'భారత్ ఫ్యూచర్ సిటీ ప్రపంచానికి ఓ దిక్సూచిగా మారబోతోంది. గ్రీన్‌ఫార్మా, స్పోర్ట్స్, హెల్త్, ఎడ్యుకేషనల్, డేటా సెంటర్లు, ఏఐ, ఫార్చ్యూన్-- 500 కంపెనీలతో విరాజిల్లబోతోంది. టోక్యో, సింగపూర్, న్యూయార్క్ వంటి గొప్ప నగరాలతో పోటీ పడబోతోంది. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ల ఎకానమీకి వేదికగా నిలవబోతోంది' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ ప్రఖ్యాత నగరాలతో పోటీ పడేలా ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసుకోవాలని, ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. బుధవారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట వేదికగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి - మిగతా3లో



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం

- గురువారం పుణెలో శాంతియుత నిరసనలు
- అనంతరం లఖ్‌నవూ, అమృత్‌సర్, జైపూర్, బెంగళూరు నగరాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు
- జూన్ 20న దేశ రాజధానిలో మరోసారి ఆందోళన చేస్తాం
- కాక్రోచ్ జనతా పార్టీ వెల్లడి



## ఇంజినీరింగ్ డ్రాపౌట్- రూ. 4.63 కోట్ల విలువైన ఆస్తులు

- ఎమ్మెల్సీ స్థానానికి నీతిశ్ కుమారుడు నిశాంత్ నామినేషన్
- బిహార్‌లో శాసనమండలి ఎన్నికల నగారా
- పది స్థానాలకు జూన్ 18న పోలింగ్
- ఎన్‌డీఏ తరఫున 9 మంది, ఆర్‌జేడీ తరఫున ఒకరు నామినేషన్ దాఖలు

## ప్రధాని మోదీకి కేంద్ర కేబినెట్ స్టాండింగ్ ఒవేషన్



- దేశాన్ని ఎక్కువ రోజులు పాలించిన నేతకు అభినందనలు
- ప్రధాని మోదీని అభినందిస్తూ కేంద్ర కేబినెట్ తీర్మానం
- అధిక కాలం పనిచేసిన ప్రధానిగా నిలిచినందుకు అభినందనలు
- ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అత్యంత పెద్ద పరీక్ష
- వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠ అనేవి ప్రజల నమ్మకాన్ని సంపాదించడానికి అవసరమైన సద్గుణాలు

## భగ్గుమంటున్న పీఓకే, ప్రగతి పథంలో కశ్మీర్

- నియంత్రణ రేఖ వద్ద భిన్నమైన పరిస్థితులు
- పాక్ ఆక్రమిత కశ్మీర్ ఆందోళనలు, హింసాత్మక అల్లర్లు
- ప్రగతి పథంలో భారత్‌లోని జమ్మూకశ్మీర్



## కాంగ్రెస్‌లో తృణమూల్ కాంగ్రెస్ విలీనంపై చర్చలు!?



- కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనంపై వస్తున్న వార్తలు అర్థరహితం
- ఊహాగానాలకు బ్రేక్ వేసిన తృణమూల్ కాంగ్రెస్



## కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్

- రాష్ట్ర రైతాంగానికి సాగు తాగునీరు అందించడానికి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టాం
- కాంగ్రెస్ ప్రభుత్వంలో 30 శాతం పనులు పూర్తి చేశాం
- కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వానికి పేరు రావద్దని.. కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు తెరపైకి తీసుకువచ్చారు.
- కాంగ్రెస్ పాలనలో నిర్మించిన అన్ని ప్రాజెక్టులు గట్టిగా నిలబడ్డాయి
- బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన కాళేశ్వరం వాళ్ల హయాంలోనే కూలిపోయింది
- రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

## ప్రైవేటు స్కూళ్ల అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట ఎలా?




- ఎనిమిదో తరగతికే లక్ష ఫీజు!
- నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, సామగ్రి దందా
- 8 నుంచి పదో తరగతికి రూ.లక్ష పైనే ఫీజు
- ఎల్‌కేజీ పుస్తకాల సెట్‌కు రూ.3 వేలు వసూలు

హైదరాబాద్

పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆశయాన్ని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అవకాశంగా మలుచుకుంటున్నాయి. ప్రతి ఏడాది ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ మధ్యతరగతి, పేద వర్గాలపై అధిక భారాన్ని మోపుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో చాలా వాటిలో సీబీఎస్?ఈ, ఒలంపియాడ్?, ఐఐటీ ఫౌండేషన్?, టెక్నో, ఐఐటీ ఫౌండేషన్? పేరిట ప్రచారంతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. నర్సరీ, ఎల్?కేజీ, యూకేజీల్లోనే రూ.50 వేలలోపు వసూలు చేస్తున్నారు. ఇక కొత్త అడ్మిషన్? అయితే అదనంగా రూ.2 వేల వరకు చెల్లించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.

జగిత్యాలకు చెందిన లక్ష్మీనారాయణది దిగువ మధ్యతరగతి కుటుంబం. స్థానికంగా ఓ వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నారు. తన కుమార్తె నాలుగో తరగతి, కుమారుడు 8వ తరగతి చదువుతున్నారు. అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించడానికి వెళ్లగా నాలుగో తరగతికి - మిగతా3లో



## భూగర్భ జలాలను పెంచేందుకు ఇస్రో ప్రాజెక్ట్

- రోడ్లపై నీళ్లు నిలవకుండా ప్లాన్?!
- భూగర్భ జలమట్టాల క్షీణతపై పెరుగుతున్న ఆందోళన
- గత ఐదేళ్లలో జిల్లాలో భూగర్భ జలమట్టం సగటున 1.5 నుంచి 2 మీటర్ల వరకు పడిపోయినట్లు అధ్యయనాలు
- రూ.50 లక్షల వ్యయంతో రీఛార్జ్ పిట్‌ల నిర్మాణం

## నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు

- ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదన్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్
- ఉత్తరాది, దక్షిణాది అనే భావనలు పెరిగితే దేశానికి ప్రమాదకరమని వెల్లడి
- ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన పవన్



# ప్రధాని మోదీకి కేంద్ర కేబినెట్ స్టాండింగ్ ఒవేషన్

ప్రధానిగా ఎక్కువ రోజులు దేశాన్ని పాలించి రికార్డు సృష్టించిన నరేంద్ర మోదీని అభినందిస్తూ కేంద్ర మంత్రివర్గం బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. అంతేకాదు కేంద్ర మంత్రులు కేబినెట్ సమావేశంలో లేచి నిలబడి ఘనంగా ఆయనకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. మొదటి సార్వత్రిక ఎన్నికల తర్వాత అత్యధిక కాలం అంటే వరుసగా 4,398 రోజులపాటు ప్రధానిగా సేవలు అందించిన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఈ రోజుతో మోదీ అధిగమించారు. ఈ నేపథ్యంలో కేబినెట్ మంత్రులు ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు.



### నాకు ఇదే అసలైన పరీక్ష!

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ స్పందిస్తూ, ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అత్యంత పెద్ద పరీక్ష అని పేర్కొన్నారు. ఎక్స్‌లో ఓ సంస్కృత శ్లోకాన్ని ఆయన పోస్టు చేస్తూ దాని భావాన్ని వివరించారు. వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠ అనేవి ప్రజల నమ్మకాన్ని సంపాదించడానికి అవసరమైన సద్గుణాలు అని అన్నారు.

"ప్రజాసేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష. వినయం, అంకితభావం, కర్తవ్య నిష్ఠతో నిరంతరం పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందుతాడు. 'సదనురక్తప్రకృతిః ప్రజాపాలనతత్పరః వినీతాత్మా హి నృపతిర్భూయసీం శ్రియమశ్నుతే'- దీని అర్థం ఏమిటంటే, ఎవరైతే ఎల్లప్పుడూ ప్రజల సంరక్షణకు అంకితమవుతారో, వినయపూర్వకమైన మనస్తత్వం కలిగిన ఆ పాలకుడే మరింత గొప్ప సంపదను, శ్రేయస్సును పొందుతాడు."

### స్వతంత్ర భారత చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం!

ప్రధాని మోదీ సాధించిన ఈ ఘనతపై ఎన్‌డీఏ నేతలతోపాటు, వివిధ దేశాల నేతలు, పలు రంగాల ప్రముఖులు నుంచి అభినందనలు తెలియజేశారు. మాజీ రాష్ట్రపతి రామ్?నాథ్ కోవింద్ మాట్లాడుతూ, "మోదీ 12 ఏళ్ల పాలనా కాలాన్ని స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో ఒక గొప్ప మైలురాయి" అని అభివర్ణించారు. వలస రాజ్యాల పాలన వల్ల భారతీయులలో నాటుకుపోయిన న్యూనతా భావాన్ని దూరం చేయడానికి మోదీ సర్కార్ చేసిన కృషిని ఆయన కొనియాడారు.

### ప్రత్యేక ప్రార్థనలు

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, మన్సుఖ్ మాండవీయ, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్త సహా వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు బీజేపీ నేతలు ప్రధాని మోదీ తరపున ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయాల్లో మోదీ తరపున పూజలు నిర్వహించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్? సింగ్ చౌహాన్? మాట్లాడుతూ, భారత్?లో అత్యధిక కాలం సేవలు అందించిన ఎన్నికైన ప్రధానిగా మోదీ నిలవడంపై ప్రశంసలు కురిపించారు. ఇది మోదీ పట్ల కోట్లాది మంది భారతీయుల ప్రేమ, నమ్మకం, అపారమైన ప్రజా మద్దతుకు నిదర్శనమని అన్నారు. ప్రధాని మోదీ సాగించిన ఈ 4,399 రోజుల ప్రయాణం శక్తివంతమైన, సంపన్నమైన, అభివృద్ధి చెందిన, స్వయంసమృద్ధ (ఆత్మనిర్భర్?) భారత్ నిర్మాణంలో ఒక 'సువర్ణ అధ్యాయం' అని ఆయన కొనియాడారు.

భారత్?ను అత్యధిక కాలం పాలించిన ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుదలకు మోదీ చేస్తున్న అపారమైన కృషిని మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం కొనియాడారు. ఇక భారత్?లో అమెరికా రాయబారిగా ఉన్న సెర్గియో గోర్? కూడా మోదీపై ప్రశంసలు కురిపించారు. "భారత్?లో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన నరేంద్ర మోదీకి అభినందనలు. ఈ ఘనత దశాబ్దాలుగా ఆయన అంకితభావంతో చేసిన ప్రజాసేవకు, బలమైన నాయకత్వానికి నిదర్శనం. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు" అని అన్నారు.

# భూగర్భ జలాలను పెంచేందుకు ఇస్రో ప్రాజెక్ట్

ఛత్తీస్‌గఢ్‌లోని పారిశ్రామిక జిల్లా కోర్బాలో భూగర్భ జలమట్టాల క్షీణిస్తుండడంతో భూగర్భ జల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ (ఎన్‌ఐయూఏ) సహకారంతో దీనిని చేపట్టింది. భారీ బొగ్గు గనులు, విద్యుత్ ప్లాంట్ల కార్యకలాపాల కారణంగా గత ఐదేళ్లలో జిల్లాలో భూగర్భ జలమట్టం సగటున 1.5 నుంచి 2 మీటర్ల వరకు పడిపోయినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమృత్ 2.0 మిషన్ కింద కోర్బాను ఎంపిక చేసి భూగర్భ జల వనరుల నిర్వహణ, పట్టణ భూగర్భ జల వనరుల పునరుద్ధరణ ప్రాజెక్టులను అమలు చేస్తున్నారు. ఇది ఎలా సాగుతుందంటే?

### ఇస్రో సహకారంతో రీఛార్జ్ పిట్

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ జలమట్టం అత్యల్పంగా ఉన్న పది ప్రాంతాలను గుర్తించి, రూ.50 లక్షల వ్యయంతో రీఛార్జ్ పిట్‌లను నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా భూగర్భ జల మట్టాన్ని పెంచడం, వర్షపు నీటిని సంరక్షించడం, పట్టణాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడాన్ని తగ్గించడం, తాగునీటి సరఫరాను స్థిరంగా కొనసాగించడం, బోర్‌వెల్‌లు ఎండిపోకుండా నివారించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు అధికారులు. జిల్లాలోని ఘంటాఘర్ సమీపంలోని సియాన్ సదన్, పంప్ హౌస్ సహా పది ప్రదేశాలను ఈ ప్రాజెక్ట్? కోసం ఎంపిక చేశారు. ఈ ప్రదేశాల్లో భూగర్భ జలమట్టం చాలా తక్కువగా ఉందని, ఈ ప్రాజెక్ట్ పూర్తయితే పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలను పెంచడానికి సహాయపడుతుందని అన్నారు.

### భూగర్భ జలవనరుల్లోకి చేరేలా

ఈ ప్రాజెక్టులో భాగంగా జల వనరులను పునరుద్ధరించడానికి అనువైన ప్రదేశాలను గుర్తించడానికి ఇస్రో ఉపగ్రహ డేటా, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలను వినియోగించారు. దీని ద్వారా నీరు భూమిలో ఎంత లోతుకు ఇంకుతుందో నిర్ధారించొచ్చు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఆధునిక రీఛార్జ్ పిట్‌లు, ఇంజెక్షన్ బావులు, ఇంకుడు గుంతలు సైతం నిర్మిస్తున్నారు. ఘంటాఘర్‌లోని సియాన్ సదన్ సమీపంలో సుమారు 100 నుంచి 120 అడుగుల లోతుతో ఇంజెక్షన్ బోర్‌వెల్‌లు తవ్వి, వర్ష కాలంలో వచ్చే నీటిని వాటిలోకి మళ్లించే ఏర్పాట్లు చేశారు. ఇంకా నీరు భూగర్భంలోకి వెళ్లే ముందు శిధిలాలు, మట్టి, రసాయనాలను తొలగించేందుకు సరైన వడపోత వ్యవస్థను అమర్చారు. ఇందుకోసం ఒక మీటరు మందంతో కంకర, ఇసుక పొరలు పోసి నీరు వడపోసి భూగర్భ జలవనరుల్లోకి చేరేలా ఆ వ్యవస్థను రూపొందిచారు. ఈ పట్టణ నీటి నిర్వహణ పద్ధతిని "షాల్లో ఆక్విఫర్ మేనేజ్‌మెంట్" అంటారు. ఇది తగ్గిపోతున్న భూగర్భ జల మట్టాలను మెరుగుపరచడానికి పట్టణాల్లో నీరు నిలిచిపోకుండా నివారించడానికి దీనిని ఉపయోగిస్తారు.

### ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం ఇదే

కోర్బాలో సాధారణంగా భూగర్భ జలమట్టం ఉపరితలం నుంచి 3 నుంచి 12 మీటర్ల లోతులో ఉన్నా, బొగ్గు గనులు, పారిశ్రామిక ప్రాంతాలతో వేసవి కాలంలో అది 20 మీటర్ల వరకు పడిపోతుందని అధికారులు చెబుతున్నారు. భారీ వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచిపోయే సమస్యలను కూడా ఈ రీఛార్జ్ గుంతలు తగ్గిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా భూగర్భ జలమట్టాల పునరుజ్జీవనమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని ద్వారా పట్టణ ప్రాంతాల్లో నీటి భద్రత మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్తులో నీటి కొరతను కూడా గణనీయంగా తగ్గించవచ్చని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశుతోష్ పాండే తెలిపారు.

### రూ. 50 లక్షల వ్యయం

ఇస్రో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ సహకారంతో వీటిని నిర్మిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశుతోష్ పాండే తెలిపారు. ఈ ప్రాజెక్ట్ కోసం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పది ప్రదేశాలను గుర్తించగా, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. దీని మొత్తం వ్యయం రూ. 50 లక్షలని, ఆరు ప్రాంతాల్లో నిర్మాణం ఇప్పటికే పూర్తవగా, మిగిలిన చోట్ల పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్ట్ భూగర్భ జల మట్టాన్ని పెంచడంలో ఖచ్చితంగా సహాయపడుతుందన్నారు.

# ఇంజినీరింగ్ డ్రాపౌట్- రూ. 4.63 కోట్ల విలువైన ఆస్తులు

బిహార్ మాజీ సీఎం నీతీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ చదువు గురించి కీలక విషయం బయకొచ్చింది. నిశాంత్ ఇంజినీరింగ్ విద్యను మధ్యలోనే ఆపేసినట్లు తెలిసింది. జూన్ 18న జరగనున్న బిహార్ శాసనమండలి ఎన్నికలలో పోటీ చేసేందుకు నిశాంత్ కుమార్ సహా మొత్తం 10 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో నిశాంత్ ఎన్నికల అఫిడవిట్‌లో తన విద్య, ఆస్తులను పొందుపర్చారు.



### నిశాంత్ కుమార్ ఆస్తులు ఎంతో తెలుసా?

మంత్రి నిశాంత్ కుమార్ రూ. 4.63 కోట్ల విలువైన చరాస్తులు, స్థిరాస్తులను కలిగి ఉన్నారు. ఇందులో రూ. 17,409 నగదు, రూ. 72,22,805 విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఉన్నాయి. అలాగే నిశాంత్ మ్యూచువల్ ఫండ్స్, పోస్ట్ ఆఫీస్‌లోని నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్(ఎన్‌ఎస్‌సీ)లో పెట్టుబడులు పెట్టారు. హ్యుందాయ్ గ్రాండ్ ఐ10, కియా సెల్టోస్ కార్లు ఉన్నాయి. వీటితో పాటు పట్నాలోని నలంద, కంకర్బాగ్, షేక్‌పురా, జగన్‌పురా ప్రాంతాలలో భూమి, ఫ్లాట్లు ఉన్నాయి. నిశాంత్‌పై ఎటువంటి క్రిమినల్ కేసులు లేవు.

### ఇంజినీరింగ్ విద్యను మధ్యలో ఆపేసిన నిశాంత్

నిశాంత్ తన ఉన్నత విద్యను పూర్తి చేయలేదు. ఆయన 1998లో పట్నా సైన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆ తర్వాత రాంచీలోని ప్రతిష్టాత్మక బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెస్రాలో బ్యాచిలర్ ఆఫ్ ఇంజినీరింగ్ కోర్సులో చేరారు. అయితే మొత్తం ఎనిమిది సెమిస్టర్లలో ఐదు మాత్రమే పూర్తి చేశారు. 2001లో మధ్యలోనే చదువు మానేయడంతో ఆ కోర్సును పూర్తి చేయలేకపోయారు. దీంతో ఇంజినీరింగ్ డ్రాపౌట్‌గా నిలిచారు.

### తండ్రి రాజీనామాతో రాజకీయాల్లోకి

బిహార్ సీఎంగా ఉన్న నీతీశ్ కుమార్ ఆ పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో నిషాంత్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆ తర్వాత సమ్రాట్ చౌధరీ మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అలాగే జేడీయూను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

### రూ.19.44 కోట్ల ఆస్తులున్న పవన్ సింగ్

మరోవైపు, భారతీయ జనతా పార్టీకి చెందిన పవన్ సింగ్ ఎమ్మెల్సీ పదవి కోసం నామపత్రాలు దాఖలు చేశారు. ఆ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను పొందుపర్చారు. పవన్ సింగ్ రూ. 19.44 కోట్ల విలువైన చరాస్తులు, స్థిరాస్తులను కలిగి ఉన్నారు. ఆయన వద్ద టయోటా ఫార్చ్యూనర్ లెజెండర్, ల్యాండ్ క్రూయిజర్, మహీంద్రా థార్, స్కార్పియో వంటి కార్లు ఉన్నాయి. సుజుకి స్కూటర్ ఉంది. పవన్ సింగ్‌పై ఆరు కేసులు నమోదయ్యాయి. పట్నా, ఆరా, లఖ్‌నవూ, ముంబయిలలో భూమి, వాణిజ్య భవనాలు, ఫ్లాట్లు ఉన్నాయి. అలాగే రూ. 70 లక్షల విలువైన బంగారం కూడా ఉంది.

బీజేపీకి చెందిన మరో అభ్యర్థి సంజయ్ మయూఖ్‌కి టాటా సఫారీ కారు, 100 గ్రాముల బంగారంతో సహా రూ. 1.76 కోట్ల విలువైన చరాస్తులు ఉన్నాయి. అనుమతి లేకుండా ఊరేగింపు నిర్వహించడం, రోడ్డుపై బైఠాయించడం వంటి ఆరోపణలపై పట్నా పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఓ కేసు నమోదైంది. మరో భారతీయ జనతా పార్టీ నేత అనిల్ ఠాకూర్ తన వద్ద 100 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ. 71,000 విలువైన వ్యవసాయ భూమి ఉన్నట్లు వెల్లడించారు. రూ. 60,000 నగదు, రూ. 1,63,000 బ్యాంక్ డిపాజిట్లు ఉన్నట్లు స్పష్టం చేశారు. అలాగే రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, మారుతి డిజైర్ కారు ఉన్నట్లు వెల్లడించారు.

### భారతీ మోహతా ఆస్తులెంతంటే?

జేడీయూ అభ్యర్థి భారతీ మెహతా ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను ప్రకటించారు. తన వద్ద 620 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి, రూ. 67,000 విలువ చేసే వజ్రం ఉందని పేర్కొన్నారు. నివాస గృహం (ఫ్లాట్), వ్యవసాయ భూమి, టయోటా ఇన్నోవా కారు ఉన్నట్లు భారతీ మోహతా తెలిపారు. మరో జేడీయూ క్యాండిడేట్ లాలన్ ప్రసాద్ వద్ద రూ. 5.60 లక్షల విలువైన చరాస్తులు, రూ. 14.90 లక్షల విలువైన స్థిరాస్తులు ఉన్నాయి. అలాగే 2007లో కొనుగోలు చేసిన మోటార్ సైకిల్, రూ. 1,00,000 విలువైన బంగారు ఉంగరం ఉంది.

### ఆర్‌జేడీ అభ్యర్థిపై 8 క్రిమినల్ కేసులు

మరోవైపు, ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆర్‌జేడీ నాయకుడు సునీల్ సింగ్ తన వద్ద రూ. 10.87 కోట్ల విలువైన చర, స్థిరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే మారుతి ఎస్టీమ్, హ్యుందాయ్ కార్లతో పాటు రూ. 61 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నాయని స్పష్టం చేసారు. డబుల్ బారెల్ బ్రీచ్ లోడింగ్ షాట్‌గన్, రివాల్వర్ కూడా ఉన్నట్లు ప్రకటించారు. తనపై ఎనిమిది క్రిమినల్ కేసులు నమోదయ్యాయని అఫిడవిట్‌లో పొందుపర్చారు. కాగా, బిహార్ శాసనమండలిలో 10 స్థానాలు ఖాళీ అయ్యాయి. వాటి కోసం నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) తొమ్మిది మంది అభ్యర్థులను బరిలోకి దింపగా, ప్రతిపక్ష రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) ఒక అభ్యర్థిని పోటీలో నిలిపింది. దాదాపుగా వీరందరూ గెలుపు లాంఛనమే. ఎటువంటి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం

జాతీయ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. గురువారం పుణెలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం లఖ్‌నవూ, అమృత్‌సర్, జైపుర్, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. అయితే, వచ్చే శనివారం నాటికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోతే జూన్ 20నుంచి దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని అభిజీత్ తెలిపారు.

### యువత భారీ సంఖ్యలో తరలిరావాలి!

ఈ ఆందోళనకు దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో తరలిరావాలని అభిజీత్ పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా పత్రాన్ని తీసుకునేంతవరకు ఎవరూ కూడా దిల్లీ నుంచి వెనక్కి తిరిగే ప్రసక్తే లేదని, తాను స్వయంగా ఈ ఆందోళనను ముందుండి నడిపిస్తానని ప్రకటించారు. పరీక్ష నిర్వహణలో జరుగుతున్న లోపాలపై యువత ఎంతమాత్రం నిశ్శబ్దంగా ఉండేందుకు సిద్ధంగా లేరని ఆయన స్పష్టం చేశారు. నీట్ పరీక్ష వాయిదా పడటంతో విద్యార్థులు మనస్తాపానికి గురై ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్‌తో పాటు సీబీఎస్?ఈలో జరుగుతున్న అక్రమాల వల్ల దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా విద్యార్థులు నష్టపోయారని, ఈ పరిస్థితికి బాధ్యత వహించేందుకు కేంద్రంలో ఎవరూ ముందుకు రావడం లేదని మండిపడ్డారు.

### పుణె నిరసన కార్యక్రమంలో సోనమ్ వాంగ్‌చుక్

భవిష్యత్తులో వైద్యులుగా మారి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన విద్యార్థులే ఈ విద్యా వ్యవస్థ వల్ల ప్రాణాలను కోల్పోతున్నారని అభిజీత్ దిప్కే దుయ్యబట్టారు. భారత విద్యా వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి, వ్యవస్థాగత వైఫల్యాల మూల్యాన్ని ఏ విద్యార్థీ చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా చూడటానికి చేపట్టిన ఉద్యమంగా దీన్ని అభివర్ణించారు. అయితే, గురువారం పుణెలో జరిగే నిరసన కార్యక్రమంలో సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొంటారని దీప్కే తెలిపారు. గత శనివారం జంతర్? మంతర్? వద్ జరిగిన నిరసనల్లోనూ సోనమ్? పాల్గొన్నారు. అంతేకాదు, ఆ నిరసనల్లో భాగంగా అభిజీత్‌ను కానీ, సీజేపీ సభ్యులను కానీ పోలీసులు అరెస్టు చేస్తే, 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు.

### జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ధర్నా

ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఓఎస్ఎం వ్యవస్థలో అవకతవకల నేపథ్యంలో గత శనివారం దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్? జనతా పార్టీ ధర్నా నిర్వహించింది. అభిజీత్? పిలుపుమేరకు వేలాదిమంది యువత నిరసన వేదిక వద్దకు తరలివచ్చి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. అయితే, ఈ నిరసనలో దాదాపు 7,000 మంది పాల్గొన్నారని అభిజీత్? దీప్కే ఇటీవల పేర్కొన్నారు. ప్రధాన్‌తో రాజీనామా చేయించాల్సిన బాధ్యతను ప్రధాని తీసుకోవాలన్నారు. దేశంలో ఎన్నికలు గత దశాబ్దకాలంగా హిందూ-ముస్లిం ఎజెండాగా ఉన్నాయని, ఈ ధోరణికి స్వస్తి పలికి, నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా పరిగణించాలని ఆయన స్పష్టం చేశారు. పొరుగు దేశాల్లో జరిగిన ఉద్యమాలతో 'కాక్రోచ్' ఉద్యమాన్ని పోలుస్తున్నారని, తమ ఉద్యమం కేవలం 'జెన్ జీ'ల కోసమే ప్రత్యేకమని దీప్కే పేర్కొన్నారు.

## భగ్గుమంటున్న పీఓకే, ప్రగతి పథంలో కశ్మీర్

భారత్, పాకిస్థాన్‌లను విడదీసే నియంత్రణ రేఖ ఇరువైపుల పరస్పర భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఆందోళనలు, హింసాత్మక అల్లర్లతో అట్టుడుకుతుంటే భారత్‌లోని జమ్ముకశ్మీర్ మాత్రం ప్రగతి పథంలో దూసుకెళుతోంది. గ్రాఖిలో ప్రజలపై సైన్యం దమనకాండలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన రోజే కశ్మీర్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించేలా అత్యంత సంక్లిష్టమైన టన్నెల్ నిర్మాణంలో కీలక పురోగతి నమోదైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో నిరసనలను అణిచివేసేందుకు పాకిస్థాన్ భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. గ్రాఖిలోని రావలాకోట్, ముజఫరాబాద్, మీర్పూర్ వంటి పట్టణాలు అశాంతి, అరెస్టులు, హత్యలతో అట్టుడుకుతున్నాయి. ఈ ప్రాంతంలో పాక్ ప్రభుత్వ ఆధిపత్యాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో అక్కడికి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న భారత జమ్ముకశ్మీర్‌లో 'జోజిలా టన్నెల్' నిర్మాణంలో కీలక ఘట్టం పూర్తికావడంతో ఇంజినీర్లు సంబరాలు చేసుకున్నారు. హిమాలయ లోతుల్లో వ్యూహాత్మక జోజిలా టన్నెల్ 'బ్రేక్‌త్రూ'ను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. పూర్తయిన తర్వాత ఆసియాలోనే అత్యంత పొడవైన ద్విముఖ సొరంగంగా ఇది రికార్డు సృష్టించనుంది. జమ్ముకశ్మీర్‌ను లద్దాఖ్‌తో అనుసంధానించే ఈ సొరంగం అన్ని కాలాల్లోనూ ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది. ఇలా నియంత్రణ రేఖకి ఇరువైపులా ఉన్న కశ్మీర్‌లో పరస్పర భిన్నమైన పరిస్థితులకు ఈ రెండు ఘటనలే సజీవ సాక్ష్యం. 1947లో పాకిస్థాన్ దుశ్చర్యల కారణంగా విడిపోయిన ఈ రెండు ప్రాంతాల ప్రస్తుత వాస్తవ పరిస్థితులను ఈ ఘటనలు కళ్లకు కడుతున్నాయి. జమ్ముకశ్మీర్, లద్దాఖ్, గిల్గిత్-బాల్టిస్థాన్, షక్స్‌గామ్ లోయలు భారత్‌లో అంతర్భాగం కాగా 1947 నుంచి పాకిస్థాన్ కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకుని దురాగతాలకు పాల్పడుతోంది. పాలనలో పాక్ సైన్యం ఆధిపత్యం, నిత్యావసరాల ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ పీవోకే ప్రజలు చాలా ఏళ్లుగా నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. ప్రస్తుత ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న జేఏఏసీ కూడా ఆర్థిక కష్టాలకు వ్యతిరేకంగానే ఉద్భవించింది. పిండి, కరెంటు సబ్సిడీ ఇవ్వాలని, రాజకీయ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ 2024, 2025లో తీవ్ర ఆందోళనలు జరిగాయి. వీటిని పాక్ భద్రతా బలగాలు టియర్ గ్యాస్, తూటాలతో దారుణంగా అణిచివేశాయి. అనేకమంది ప్రాణాలు బలి తీసుకున్నాయి. ఈ నిరసనల్లో పాక్ నుంచి తమకు స్వాతంత్ర్యం కావాలంటూ స్థానికులు నినాదాలు చేశారు. పీఓకేలోని వనరులను దోచుకుంటూ, పాక్ అవలంబిస్తున్న అణచివేత విధానాల ఫలితమే ఈ అశాంతి, హింస అని భారత్ స్పష్టం చేసింది. మరోవైపు గడిచిన దశాబ్ద కాలంగా జమ్ముకశ్మీర్ ప్రగతి ప్రథంలో పరుగులు పెడుతోంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన భారీగా పెరిగింది. పెద్దఎత్తున జాతీయ రహదారులు, సొరంగాలు, రైల్వేలు, విద్యుత్ ప్రాజెక్టులు, పర్యాటక మౌలిక సదుపాయాలపై కేంద్రం భారీగా పెట్టుబడులు పెడుతోంది. 2021కి ముందు కేవలం 450 కోట్లుగా ఉన్న వార్షిక పెట్టుబడులు 2025-26 నాటికి 5వేల 824 కోట్లకు చేరాయి. లక్షా 60వేల కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. 2020లో ఇక్కడ 69 స్టార్టప్‌లు మాత్రమే ఉండగా, ప్రభుత్వ ప్రత్యేక విధానాలు, ఇంక్యుబేటర్లు, సీడ్-ఫండింగ్ మద్దతుతో 2025-26 నాటికి ఆ సంఖ్య 13వందలు దాటింది.

జెడ్-మోర్ టన్నెల్, చీనాబ్ రైల్వే బ్రిడ్జి, కొత్త హైవేలు ఇక్కడి ప్రగతికి నిదర్శనాలు. మంచు కొండలు, పచ్చని లోయల నుంచి. వందేభారత్ రైళ్లు పరుగులు తీయడం కొన్నేళ్ల క్రితం ఊహకు కూడా అందని దృశ్యం ఇప్పుడు కనిపిస్తోంది. కశ్మీర్‌లో కనిపిస్తున్న ఈ స్పష్టమైన అభివృద్ధి పాకిస్థాన్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. అందుకే పహల్గామ్ లాంటి దాడుల ద్వారా అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని భద్రతా విశ్లేషకులు చెబుతున్నారు.

## కాంగ్రెస్‌లో తృణమూల్ కాంగ్రెస్ విలీనంపై చర్చలు!?

తృణమూల్ కాంగ్రెస్? పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయనున్నారని వస్తున్న వార్తలను మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గాలు బుధవారం ఖండించాయి. తమకు అలాంటి ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశాయి. మంగళవారం టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ మధ్య భేటీ జరిగింది. అంతకు ముందు రోజు దిల్లీలో జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వీరిద్దరూ ఆలింగనం చేసుకున్న ఒక ఫొటోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. అయితే ఆ ఇరువురు మహిళా నేతల సమావేశానికి సంబంధించిన వివరాలను మాత్రం ఇరుపార్టీలు అధికారికంగా వెల్లడించలేదు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్?లో టీఎంసీ విలీనంపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే కాంగ్రెస్?లో తృణమూల్ కాంగ్రెస్? విలీనం కానుందనే ప్రచారాన్ని ఒక సీనియర్? టీఎంసీ నేత తోసిపుచ్చారు. వీటిని ఆధార రహితమైన వార్తలుగా అభివర్ణించారు. "విలీనం గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. దీనిపై వస్తున్న వార్తలు అన్నీ అవాస్తవాలు" అని తేల్చిచెప్పారు. అటు కాంగ్రెస్ పార్టీ సైతం ఈ ప్రచారాన్ని ఖండించింది.

# ఇదే 'ఫ్యూచర్'

-మొదటిపేజీ తరువాయి

శ్రీనివాస్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఎఫ్‌సీడీఏ విజన్ ఇన్ యాక్షన్ ప్లాన్ పోర్టల్, లోగోను ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

**ఇదే ఉత్సాహంతో ముందుకెళ్లాలి..**

'150 రోజుల్లో ఎఫ్‌సీడీఏ భవనాన్ని పూర్తి చేసుకున్నాం. ఇది మా పనితనం. మా అధికారుల వేగవంతమైన ప్రణాళిక. ఇదే ఉత్సాహంతో ముందుకు వెళ్లాలి. అభివృద్ధి పథం వైపు నడవాలి. స్థానికుల అభ్యర్థన మేరకు కొన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలిపాం. భవిష్యత్తులో ఈ నగరం మరింత రాణిస్తుంది. అడ్డుపడ్డోళ్లను అడ్డంగా తొక్కుకుంటూ ముందుకు వెళ్తాం. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహితనగరంగా రాణిస్తుంది

**చిన్న వర్షానికే వరదలు**

నగరంలోని వీధులను తరచూ ముంచెత్తుతున్న వరదలకు, ట్రాఫిక్ అంతరాయానికి నాటి పాలకుల పాపమే కారణం. నగరంలో పెద్ద వర్షం పడలేదు. చిన్నపాటి వర్షానికే వరద ఏరులై పారింది. ట్రాఫిక్ స్తంభించింది. రెండు కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటలు పట్టింది. పదేళ్లలో అభివృద్ధి చేశాం. వంద కోట్లకు ఎకరం అమ్మామని చెప్పడం కాదు. నిన్నటి ట్రాపిక్ సమస్యకు కారణం ఎవరో చెప్పాలి.

**కబ్జాలపై మరింత కఠినంగా..**


గత ప్రభుత్వంలోని దుర్మార్గులు చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. చెరువులను చెరబట్టి, అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్లే చెరువులు, కుంటలోల్ ఉండాల్సిన వరద నీరు రోడ్లపైకి వస్తోంది. గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతోనే ఆక్రమణలు తొలగించి, చెరువులు, కుంటలను పునరుద్ధరిస్తున్నాం. వాటి చుట్టూ పార్కులు, మార్కెట్లు తీసుకొచ్చి లేక్ ఎకానామీ సృష్టించబోతున్నాం. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై మరింత కఠినంగా వ్యవహరించబోతున్నాం. కబ్జాలకు పాల్పడిన వాళ్లను వదలం. వారి వెనుక ఉన్నవాళ్ల తోకలు కట్ చేయడానికి కూడా వెనకాడం.

**అదేమైనా మీ తాత జాగీరా?**

బీఆర్‌ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి 15 ఎకరాలు కబ్జా చేశాడు. దీన్ని కేసీఆర్ ఆయనకు రాసిచ్చాడు. అదేమైనా మీ తాతా జాగీరా? ఆడబిడ్డలు ఆడుకునే బతుకమ్మ కుంటను దుర్మార్గులు చెరబడితే నిర్దాక్షిణ్యంగా ఆక్రమణలను తొలగించాం. కుంటకు మళ్లీ జీవం పోశాం. గండిపేట, హిమాయత్‌సాగర్ ఆక్రమణలను తొలగించే పని చేస్తున్నాం. ఇవన్నీ మా కోసం కాదు.. భవిష్యత్తు తరాల కోసమే..' అని సీఎం చెప్పారు.

**తెలంగాణ ముఖ చిత్రమే మారింది**

'హైదరాబాద్‌కు గొప్ప చరిత్ర ఉంది. ఆనాటి కులీకుతుబ్‌షాలు, నిజాం నవాబులు హైదరాబాద్ నగరాన్ని విస్తరింపజేశారు. ప్రపంచ పటంలో హైదరాబాద్‌కు ఒక మంచి గుర్తింపు వచ్చింది. చార్మినార్ నుంచి గుల్జార్‌హౌస్ వరకు, మొజాంజాహీ మార్కెట్ నుంచి ఖబూతర్‌ఖానా వరకు విస్తరించకపోతే చరిత్రలో గుర్తింపు వచ్చేదా? 200 ఏళ్ల క్రితం సికింద్రాబాద్ విస్తరణతో జంటనగరాలుగా వెలుగొందుతున్నాయి. సైబరాబాద్ సాంకేతిక విప్లవం. 60 శాతం ఆదాయం అందిస్తుంది. ఇక్కడ ఎకరం రూ.200 కోట్లు పలుకుతోంది. తెలంగాణ ముఖ చిత్రమే మారింది. బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూముల విలువ అధికం.



**కుట్రలు, కుతంత్రాలు చేసినవాళ్లూ ఉన్నారు..**

1908లో నగరాన్ని వరదలు ముంచెత్తి వేలాది మంది చనిపోతే నిజాం చలించారు. మూసీ, ఈసీలు ఉప్పెనై కమ్మేయకుండా జంట జలాశయాలు నిర్మించారు. ఆనాడు సైబరాబాద్, హైటెక్‌సిటీ అంటే నవ్వినోళ్లు ఉన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అడ్డుకున్నారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు వద్దే వద్దు అన్నోళ్లూ ఉన్నారు. ఈ నగరం అభివృద్ధి చెందకూడదని కుట్రలు, కుతంత్రాలు చేశారు. కానీ ఆనాటి ముఖ్యమంత్రులు హైటెక్ సిటీ, ఎయిర్‌పోర్ట్, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీ, ఐటీ సంస్థలు, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ వంటి సంస్థలను తీసుకురాకపోతే.. పది లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించేవా?..' అని రేవంత్ ప్రశ్నించారు.

**వచ్చేసారి ప్రతిపక్ష హోదాకూడా రాదు..**

'ఆనాడు రామాయణంలో రావణాసురుడు ఉన్నట్లు.. నగర అభివృద్ధిలో రావణాసురులు, మారీచులు, సుబాహుడు, శుక్రాచార్యుడు ఉన్నారు. శుక్రాచార్యుడు ఫాంహౌస్‌లో పండిండు. మారీచుడు, సుబాహులను మనపై వదిలాడు. పెద్ద రాక్షసుడు, పిల్ల రాక్షసుడు కలిసి ఫ్యూచర్ సిటీని అడ్డుకుంటామంటున్నారు. అమెరికా వెళ్లి ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. కానీ మీకు గతమే ఉంది. భవిష్యత్తు లేదు. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదు..' అని సీఎం ఎద్దేవా చేశారు.

**విషం చిమ్ముతున్న బీఆర్‌ఎస్: భట్టి**

ఆనాటి ప్రభుత్వం ఫార్మాసిటీ పేరుతో ఈ ప్రాంతాన్ని కలుషితం చేయాలని చూసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫార్మాసిటీని రద్దు చేసి, గ్రీన్ ఫ్యూచర్ సిటీని తీసుకొచ్చిందని అన్నారు. కానీ ఓటమితో నిరాశా నిస్పృహలతో ఉన్న బీఆర్‌ఎస్ విషం చిమ్ముతోందని విమర్శించారు. కొన్ని గ్రామాలను ఎఫ్‌సీడీఏలో విలీనం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

**హైటెక్ సిటీకి దీటుగా..: శ్రీధర్‌బాబు**

హైటెక్ సిటీకి దీటుగా కొత్త నగరాన్ని నిర్మించాలనే ఆలోచనతో రెండున్నరేళ్లుగా అహరి?నశలు శ్రమిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ ప్రాంతవాసుల జీవనశైలిలో మార్పులు రాబోతున్నాయని, కాలుష్యం లేని పరిశ్రమలు వస్తాయని చెప్పారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక తదితరులు మాట్లాడారు.


**కొత్త శక్తిని నింపుకోవడానికి కలిసి రండి**
**-- 'ఎక్స్'లో సీఎం రేవంత్‌రెడ్డి**

'భారత్ ఫ్యూచర్ సిటీ ఇప్పుడు ఒక నిజం. మనం విదేశాలకు వెళ్లి గొప్ప నగరాలను చూసినప్పుడల్లా.. ఇంతటి ఆధునిక, ప్రణాళికాబద్ధమైన, అద్భుతంగా నిర్వహించే నగరం మన దేశంలో కూడా ఉంటే ఎంత బాగుంటుందో అని అనుకున్నాం. భారతీయులందరి సామూహిక కోరికకు సమాధానమే ఈ భారత్ ఫ్యూచర్ సిటీ. దీని కార్యాలయ భవనాన్ని ఆరు నెలల్లోనే ప్రారంభించుకున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో దీని ప్రాముఖ్యత కారణంగా ఈ రోజు ఎప్పటికీ గుర్తుండిపోతుంది..' అని సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీని భూగోళంపైనే అత్యంత గొప్ప నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దే వరకు శ్రమించేలా కొత్త శక్తిని నింపుకోవడానికి నాతో కలిసి రండి..' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

## ప్రైవేటు స్కూళ్ల అడ్డగోలు దోపిడీకి
# అడ్డుకట్ట ఎలా?

-మొదటిపేజీ తరువాయి

రూ.40 వేలు, ఎనిమిదో తరగతికి రూ.72 వేలు ఫీజు చెల్లించాలని యాజమాన్యం తెలపడంతో అవాక్కయ్యారు.




**నియంత్రణ కరువు**

ప్రైవేట్ స్కూల్‌ల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో కొన్ని యాజమాన్యాలు అధికంగా నిర్ణయించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా వసూలు చేయాలి. గతంలో ప్రాథమిక తరగతులకు రూ.9వేలు, ఉన్నత తరగతులకు రూ.13 వేలకు సర్కారు నిర్ణయించగా ఆయా యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీంతో సదరు ఉత్తర్వులు నిలిపివేశారు. అప్పటినుంచి పాఠశాల యాజమాన్యాలే ఫీజులు నిర్ణయించుకునే వెలుసుబాటు కల్పించింది. ఫీజుల క్రమబద్ధీకరణకు కమిటీ లేకపోవడంతోనే ఈ సమస్యకు కారణమైంది.

"అధిక ఫీజుల వసూళ్లకు సంబంధించి మాకెలాంటి ఫిర్యాదు రాలేదు. ఫీజుల నిర్ణయం ఆయా పాఠశాలల యాజమాన్యాలదే. సౌకర్యాలకు సంబంధించి నిబంధనలు అతిక్రమిస్తే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం"

**అన్నింటికీ చెల్లించాల్సిందే!**

5వ తరగతి నుంచి 7 తరగతి వరకు రూ.35 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజులున్నాయి. 8వ తరగతి నుంచి 10వ తరగతికి రూ.లక్ష పైనే ఉంది. మరి ఇంత ఫీజులు ఎందుకని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పిల్లలకు ఐఐటీ ఫౌండేషన్? కోర్సు బోధిస్తున్నామని ఏదో మాటలు చెబుతున్నారు. మరోవైపు పాఠశాల యూనిఫాం, టై, బూట్లు, బెల్ట్? ఇలా అన్నింటికీ ప్రత్యేక ధరలు నిర్ణయించి తమవద్దే కొనుగోలు చేయాలని యాజమాన్యాలు నిబంధన విధించాయి. కానీ దీనివల్ల తల్లిదండ్రులకు అదనపు భారం అవుతోంది.

**పుస్తకాల కొనుగోలుకు రూ.3-8 వేల వరకు**

ప్రైవేటు ఉద్యోగుల వేతనాలు, ఉపాధి శ్రామికులు, రోజువారీ కూలీల వేతనాలు ప్రతి ఏడాది పెరిగే పరిస్థితి ఉండదు. అయితే పిల్లల చదువులకు వచ్చేసరికి ప్రతి ఏటా స్కూల్? ఫీజులకు, పుస్తకాలకు వెచ్చించే ఫీజు చెల్లింపులు పెరుగుతుంది. కేవలం నర్సరీ చదువుకు పాఠశాల పరిస్థితిని అనుసరించి రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇవన్నీ చూస్తుంటే చదువులు ఎంత ఖరీదుగా ఉన్నాయనే విషయం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కేవలం పుస్తకాలు కొనుగోలు చేసేందుకే రూ.3 నుంచి రూ.8 వేల వరకు పాఠశాల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు.

**యాజమాన్యాల కాసుల వర్షం**

కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో 1000 నుంచి 2000 మంది వరకు విద్యార్థులు ఆయా తరగతుల్లో చదువుతున్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైతే ఆ యాజమాన్యాలకు కాసుల వర్షం కురుస్తోంది. ఉదాహరణకు ఆ పాఠశాలలో 2000 మంది విద్యార్థులు ఉన్నారనుకుంటే సుమారుగా ఒక్కో విద్యార్థిని రూ.5 వేలు చొప్పున అనుకున్న కేవలం పుస్తకాల మీదే రూ.కోటికి పైగా వ్యాపారం జరుగుతోంది. దీనిలో సుమారు 40 శాతం వారికి లాభం ఉండనుంది.

## నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు

తనను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారన్న జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్?? ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని హితవు పలికారు. ఉత్తరాది, దక్షిణాది అనే భావనలు పెరిగితే దేశానికి ప్రమాదకరమని తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదు!**

ఎక్కడైనా సమస్యలుంటే వాటిపై మాట్లాడవచ్చని పవన్ కల్యాణ్ తెలిపారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని, విభజన వాదం దేశానికి మంచిది కాదని సూచించారు. ఇలా అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుందన్నారు. 570కు పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉందని అన్నారు.

**ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదు**

యువకుడిగా ఉన్నప్పుడు నక్సలైట్‌గా మారాలని అనుకున్నానని, తన అన్నయ్య చిరంజీవి నిర్మాణాత్మకమైన మార్గం వైపు తనని నడిపించారని గుర్తు చేసుకున్నారు. రాజకీయాలు మారాలని దేశంలోని యువత కోరుకుంటోందని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోందని తెలిపారు. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలని, ప్రస్తుత యువతకు స్పష్టమైన, ఆచరణాత్మక ఫలితాలు కావాలని వివరించారు.

**అందుకే జాగీర్ అనే పదం వాడాను**

తెలంగాణలో పోటీ చేయాలని తమ పార్టీ నేతలు కోరారని జనసేన అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు.తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నానని పవన్ ఆకాంక్షించారు. తానెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరని ఆయన వ్యాఖ్యానించారు. ఈ దేశం నాది, ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడానని పవన్? కల్యాణ్ వివరణ ఇచ్చారు. తెలంగాణల తరహాలోనే తమిళనాడు, కర్ణాటకలోనూ చాలామంది తెలుగువాళ్లు ఉన్నారన్నారు.

రాష్ట్ర విభజనకు తానెప్పుడూ వ్యతిరేకం కాదని, చేసిన తీరుని మాత్రమే వ్యతిరేకించానని తెలిపారు. రాష్ట్ర విభజన విషయంలో కాంగ్రెస్ పార్టీ సరిగా వ్యవహరించలేదని పవన్ ఆరోపించారు. తెలంగాణలో కొందరు వ్యక్తులు కావాలనే తనపై వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో తాను దశాబ్దాలుగా నివసిస్తున్నాని తెలిపారు. ఈ దేశంలో ఎవరు, ఎక్కడైనా ఉండవచ్చు, ప్రచారం చేయవచ్చని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్ట్

**జయశంకర్ భూపాలపల్లి:** కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించారు. బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలలో భాగంగా బోర్ హోల్స్ పనులను పరిశీలించారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలోనే రాష్ట్ర రైతాంగానికి సాగు తాగునీరు అందించడానికి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టామని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో 30 శాతం పనులు పూర్తి చేశామన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వానికి పేరు రావద్దని.. కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు తెరపైకి తీసుకువచ్చారన్నారు. చేవెళ్ల నుండి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్పు చేసి తెలంగాణకు తీరని ద్రోహం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటివరకు లక్ష 45 వేల కోట్లు ఖర్చు. మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టు నుండి ఒక్క చుక్క నీరు కూడా ఉపయోగంలోకి రాలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ప్రాజెక్టు లోపభూయిష్టంగా ఉందని నిపుణులు నివేదిక ఇవ్వడం జరిగిందని తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఇతర సంస్థల చేత బ్యారేజ్ కొంగుబాటుపై దర్యాప్తు జరిపించడం జరిగిందన్నారు. ఆఫ్రి సంస్థ ఆధ్వర్యంలో రీ డిజైన్ పనులు కొనసాగుతున్నాయన్నారు. జూలై మొదటి వారంలోపు పరీక్షలు పూర్తి చేస్తామని తెలిపారు.

**సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు: మంత్రి ఉత్తమ్**

కాంగ్రెస్ పాలనలో నిర్మించిన అన్ని ప్రాజెక్టులు గట్టిగా నిలబడ్డాయని, బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన కాళేశ్వరం వాళ్ల హయాంలోనే కూలిపోయిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల పరిస్థితి ఏమైందో అందరూ గమనించాలన్నారు. బుధవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన ఆయన.. జాకోరా, చందూర్ ఎత్తిపోతలను ప్రారంభించారు. సిద్ధాపూర్ రిజర్వాయర్‌ను పరిశీలించారు. అనంతరం స్థానికంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. సవరించిన అంచనాల మేరకు సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు మరో రూ.200 కోట్లు మంజూరు చేస్తామన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపడతామని తెలిపారు. కాలువలను సౌర విద్యుత్ ఉత్పత్తికి వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీని మంత్రి ఉత్తమ్ పరిశీలించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీ మార్పుతోనే పెద్ద తప్పు జరిగిందన్నారు. ప్రపంచ స్థాయి నిపుణులు, సంస్థల సహకారంతో 2027 జులై వరకు పునరుద్ధారణ పూర్తి చేస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా ఒక చుక్క నీరు వినియోగం చేయకుండా రికార్డు స్థాయిలో 2.95 లక్షల మెట్రిక్ టన్నులు ధ్యానం కొనుగోలు చేపట్టామన్నారు.

## నకిలీ నంబర్ ప్లేట్ వాడితే జైలుకే



నకిలీ నంబర్ ప్లేట్‌ను వాడటం చట్టవిరుద్ధం. ఇది అందరికి తెలిసిన విషయమే అయినా కొందరు చలాన్ల నుంచి తప్పించుకునేందుకు, నేరాలు చేసినప్పుడు పోలీసులను తప్పుదారి పట్టించేందుకు తన వెహికల్ నెంబర్ మారుస్తుంటారు. గతంలో ఇలా చేస్తే జరిమానా విధించిన పోలీసులు ఇప్పుడు కఠిన చర్యలకు దిగారు. బండికి నకిలీ నెంబర్ ప్లేట్ ఉంటే జైలుకు పోక తప్పదని హెచ్చరిస్తున్నారు. తాజాగా సంగారెడ్డి జిల్లాలో నకిలీ నంబర్ ప్లేట్?ను ఉపయోగించి పోలీసులను ఓ యువకుడు తప్పుదోవ పట్టించాడు. గుర్తించిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, సంగారెడ్డి టౌన్ పోలీసులు సంయుక్తంగా అతడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అసలు యజమానిపై చలాన్లు

నిందితుడు ఈ నకిలీ నంబర్ ప్లేట్‌ను ఉపయోగించి పలుమార్లు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డాడు. అయితే ఆ నంబర్ ప్లేట్‌ను కలిగి ఉన్న అసలు వాహన యజమాని హైదరాబాద్ నివాసి ఆసిఫ్ ఖాన్. నిందితుడి చర్య వల్ల ఆసిఫ్ ఖాన్ పేరున ట్రాఫిక్ చలాన్లు జనరేట్ అయ్యాయి. దీనిపై ఆసిఫ్ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు : విచారించిన పోలీసులు నకిలీ నెంబర్ ప్లేట్?తో తిరుగుతున్న అరుణ్?ను అరెస్ట్ చేశారు. సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌లో 224/2026 నెంబర్?తో ఎఫ్?ఐఆర్? నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) లోని సెక్షన్318(4) అలాగే మోటార్ వాహనాల చట్టంలోని సెక్షన్? 192 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు.

ప్రజలకు హెచ్చరికలు : వాహనాలకు నకిలీ, ఒకే రకమైన పోలికలు ఉన్న లేదా మార్పులు చేసి నంబర్ ప్లేట్లను ఉపయోగించరాదని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), మోటార్ వాహనాల చట్టం ప్రకారం అత్యంత తీవ్రమైన శిక్షార్హమైన నేరమని చెబుతున్నారు. ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎవరైనా మీ బండి నెంబర్ వాడితే ఏం చేయాలి

ఇలాంటి వాహనాల కదలికలను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం సీసీటీవీ సర్వైలెన్స్, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలతో కూడిన అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలను కలిగి ఉంది. ఎవరైనా తమ వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను దుర్వినియోగం చేస్తున్నట్లు అనుమానం వస్తే, పౌరులు వెంటనే క్రింది మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేయాలని కోరారు.

## సంపాదకీయం

# కృత్రిమ మాయలో మనిషి

'కృత్రిమ మేధ'గా మనం చెప్పుకునే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' (ఏఐ) 'కపటి' అనే అర్థంలో నిజంగానే కృత్రిమంగా మారి ప్రపంచాన్ని భయపెడుతోంది. తెలుగులో 'నకిలీ తెలివి' లాంటి మాటల్ని వెతుక్కునే లోపలే అది నకిలీ విన్యాసాలలో చిత్రవిచిత్రమైన లోతులు చూస్తోంది. ఒక చేత్తో సానుకూలపు పూల బాణాలనూ, ఇంకోచేత్తో ప్రతికూలపు వాడిబాణాలనూ ప్రయోగిస్తూ జనాన్ని ఏకకాలంలో మోహపారవశ్యంలోనూ, భయవిభ్రమాల్లోనూ ముంచెత్తుతోంది. అనుకూల ఫలితాలపై ఆశపడుతూనే, ప్రతికూల ప్రభావాలనుంచి తప్పించుకునే మార్గాల వేటలో ప్రపంచం తలమునకలవుతోంది. భారత్, చైనా, రష్యా సహా పది దేశాలు సభ్యులుగా ఉన్న 'బ్రిక్స్' కూటమి కృత్రిమ మేధో వినియోగంలో, అభివృద్ధిలో, దానితో ముడిపడిన నైతిక సమస్యల నివారణలో, మేధో హక్కులూ, డేటా పరిరక్షణలో కలసి పనిచేసే దిశగా అడుగులు వేస్తోంది. తాజాగా, సాంస్కృతిక రంగంలో కృత్రిమ మేధో దుర్వినియోగాన్ని అరికట్టే లక్ష్యంతో వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరుపుతోంది; ఒక సమావేశానికి ప్రపంచ పురాతన నగరాలలో ఒకటైన వారణాసి వేదిక కాబోతోంది. కృత్రిమ మేధ ఏం చేస్తోందంటే, ఒక సాంకేతిక మహాద్భుతంగా మాయామేయ మాంత్రిక జగత్తును సృష్టిస్తూ పురాణ, ఇతిహాస, జానపద కథల కాలంలోకి తీసుకెడుతోంది. రామాయణంలో భర్త శాపానికి గురై అహల్య శిలగా మారిపోవడం, రాముని పాదాలు తాకగానే పూర్వరూపం తెచ్చుకోవడం గురించి చదివాం; 'జగదేకవీరుని కథ' సినిమాలో జలక్రీడలాడుతున్న దేవకన్యలను చూసిన పాపానికి వారి శాపానికి ఎరై కథానాయకుడు శిలగా మారిపోవడం, ఒక వృద్ధ మహిళ అతనికి శాపవిముక్తి కలిగించడం చూశాం. త్రిశంకుని స్వర్గానికి పంపించే ప్రయత్నంలో అతణ్ణి మధ్యలోనే స్తంభింపజేసి 'త్రిశంకు స్వర్గా'న్ని సృష్టించిన విశ్వామిత్రుని పునఃసృష్టి పాటవాన్ని కథల్లో దర్శించాం. రామాయణంలో ఇంద్రజిత్తు చేసే మబ్బుచాటు మాయావి యుద్ధాన్నీ, మహాభారతంలో సైంధవుని వధ సందర్భంలో కృష్ణుడు చక్రం అడ్డేసి కృత్రిమ సూర్యాస్తమయాన్ని సృష్టించడాన్నీ తిలకించాం. తన అర్ధాంగి పార్వతి అభ్యంగన స్నానానికి వెడుతూ నలుగుపిండి నుంచి సృష్టించి కాపలాపెట్టిన బాలుడు తనను అడ్డగించినందుకు శివుడు ఆగ్రహించి అతని శిరస్సును ఖండించడం; నిజం తెలిసి అతనికి ఏనుగు తలను అతికించి, బతికించడం గురించి విన్నాం. తలలు తీసి తలలు పెట్టడంతో సహా కృత్రిమ మేధ ఇలాంటి చిత్రవిచిత్ర సన్నివేశాలను అవలీలగా సృష్టించగలుగుతోంది. అవి కపటత్వపు అంచులు తాకుతూ ప్రసిద్ధ వ్యక్తుల శీలహననానికి పాల్పడుతూ వివాదాస్పదమవుతున్నాయి; నిజమో, అబద్ధమో తెలియని త్రిశంకు స్థితికి జనాన్ని నెడుతున్నాయి. రాజకీయ నాయకులు, సినీనటులతో సహా ప్రముఖుల రూపాలనూ, గొంతులనూ వాడుకుంటూ అభ్యంతరకర సన్నివేశాలను సృష్టించడం, వారు న్యాయస్థానాలను ఆశ్రయించడం చూస్తున్నాం. పూర్తి సాంకేతిక నైపుణ్యాలూ, సాంకేతికతను బాధ్యతాయుతంగా వాడుకోవాలనే స్పృహ లేనివారికి కూడా కృత్రిమ మేధ అందుబాటులోకి రావడం వల్ల తలెత్తే ఇలాంటి వైపరీత్యాలతో కూడా పురాణ, ఇతిహాస కథలతో పోలిక కుదరడం మరో వైచిత్రి. ఉదాహరణకు, మహాభారతంలోని అశ్వత్థామతో ముడిపడిన ఒక ఉదంతాన్నే చూస్తే, కురుక్షేత్ర యుద్ధాంతంలో అతను ఉపపాండవులను వధించి పారిపోయినప్పుడు అతణ్ణి పట్టుకోవడానికి భీముడు బయలుదేరివెడతాడు; అశ్వత్థామ క్రూరుడనీ, చపలచిత్తుడనీ; అతని దగ్గర 'బ్రహ్మశిరోనామక'మనే దివ్యాస్త్రం ఉందనీ, దాని ప్రయోగమే తప్ప ఉపసంహారం అతనికి తెలియదనీ కృష్ణుడు అర్జునుడితో చెప్పి భీముని కాపాడుకోవడానికి తక్షణమే వెళ్ళాలంటాడు; ఊహించినట్టే అశ్వత్థామ దానిని ప్రయోగించడం, ప్రయోగోపసంహారాలు రెండూ తెలిసిన అర్జునుడు అదే అస్త్రంతో దానిని శాంతింపచేయబోవడం చూస్తాం. మనిషి-- తన మేధ సృష్టించిన కృత్రిమ మేధముందు తనే చిత్తవుతున్నాడు. మాంత్రికతనుంచి వాస్తవికతవైపు వెడుతున్న భ్రమలో ఉన్న మనిషిని కృత్రిమ మేధ తిరిగి మాంత్రికతవైపు మళ్ళిస్తూ పైచేయిని చాటుకుంటోంది. తను సృష్టించిన సాంకేతికత చేతిలో తనే ఓడి దిక్కులు చూసే పరిస్థితిని తెచ్చుకోవడం మనిషిని తొలినుంచి వెంటాడుతున్న శాపం.

# తృణమూల్ అల్లకల్లోలం

పగబట్టింద్రు, పడగొట్టింద్రు. పశ్చిమ బెంగాల్‌లో మమతా దీదీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) సర్కార్‌ను ఓడించి బీజేపీ అధికార పగ్గాలు చేజిక్కించుకోవటం గురించి చెప్పాలంటే ఈ రెండు మాటలు అతికినట్టుగా సరిపోతాయి. ఈ తతంగం ప్రాంతీయ శక్తులపై ఢిల్లీ సింహాసనం జరిపిన ముష్కర దండయాత్రలా కనిపించింది. 'అరయంగా కర్ణుడీల్గె ఆర్గురి చేతన్' అన్నట్టుగా బెంగాల్ టైగర్‌ను అన్నివైపుల నుంచి చుట్టుముట్టి, తీవ్ర దుష్ప్రచారం చేసి, ఎన్నికల బరిలో ఓడగొట్టారు. అయితే అంతటి తోనే బీజేపీ నాయకత్వం సంతృప్తి చెందలేదు. ముప్పయ్ ఏండ్ల కమ్యూనిస్టు కంచుకోటను బద్దలుకొట్టి మూడు విడతలు విజయవిహారం చేసిన దీదీ పార్టీ కొనసాగితే ఎప్పటికైనా ప్రమాదమేనని భావించి ఆ పార్టీని ముక్కలు ముక్కలు చేసి ఉనికి లేకుండా చేయాలనేది మోదీ అండ్ కో ప్రణాళిక. దీదీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ రూపంలో ముసలం ఒకటి టీఎంసీలో సిద్ధంగానే ఉన్నది. పార్టీలో అతడి ప్రాబల్యం మీద పెరిగిన అసమ్మతి ఇప్పుడు ఎన్నికల ఓటమి అదును చూసుకుని బుసలుకొడుతున్నది. ముందుగా టీఎంసీ ఎమ్మెల్యేల్లో చీలిక వచ్చింది. ఇపుడు ఎంపీల్లోనూ చీలిక వచ్చింది. ఇదే అదనుగా టీఎంసీలో అసమ్మతిని ఎగదోసి లబ్ధి పొందాలని బీజేపీ చూస్తున్నది. చీలిక వర్గాలు రాష్ట్ర స్థాయిలో అసెంబ్లీ స్పీకర్‌ను, కేంద్రంలో లోక్‌సభ స్పీకర్‌ను కలిసి బీజేపీ/ఎన్డీయేకు మద్దతు ఇస్తున్నామని చెప్పడం ఈ బాగోతం వెనుక ఎవరున్నదీ బయటపెడుతున్నది. లోక్‌సభలో గణాంకాల ప్రకారం బీజేపీ కొన్ని వివాదాస్పద బిల్లులు ఆమోదింపజేసుకోవాలంటే కూటమి ప్రస్తుత బలం సరిపోదు. పార్లమెంటులో అనుకున్నది సాధించాలంటే అదనపు సభ్యుల బలం కావాల్సిందే. ముఖ్యంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ బిల్లు, మహిళా బిల్లుపై బీజేపీ మొండిగా ఉన్నది. పార్టీ బలం ఉన్న ఉత్తరాదిపై పట్టు బిగించేందుకు, మహిళల ఓట్లను రాబట్టుకునేందుకు ఈ రెండు బిల్లులను ఏదో విధంగా ఆమోదింప చేసుకోవా లని చూస్తున్నది. ఈ తరుణంలోనే స్వల్ప ఓట్ల తేడాతో భారీగా



సీట్లు కోల్పోయిన తృణమూల్ పార్టీ బీజేపీ నాయకత్వానికి బలిపశువుగా దొరికింది. అనేక రాష్ట్రాల్లో పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన అనుభవంతో టీఎంసీలో అల్లకల్లోలం సృష్టించి ఆయారామ్ గయారామ్‌లను తనవైపు మళ్లించుకోవాలని ఆరాటపడుతున్నది. సహజంగానే ప్రాంతీయ పార్టీల్లో ఉన్న వెన్నెముక లేని నాయకుల నేతృత్వంలో నిన్నటిదాకా బద్ధశత్రువులా పోరాడిన పార్టీకి మద్దతు తెలిపేందుకు చీలికవర్గాలు పోటీ పడటం దేశ రాజకీయాల్లో విషాద పరిణామం. 2014లో 282 ఎంపీ సీట్లు సాధించిన బీజేపీ 2019లో జరిగిన ఎన్నికల్లో 303 స్థానాలతో బలాన్ని ఇతోధికంగా పెంచుకున్నది. ఈ అప్రతిహత జైత్ర యాత్రకు 2024లో బ్రేక్ పడింది. బీజేపీ గ్రాఫ్ మెజారిటీ మార్కు (272) దిగువకు పడిపోయి 240కి పరిమితమైపోయింది. దాంతో బీహార్ సీఎం నితీశ్, ఏపీ సీఎం చంద్రబాబు మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అగత్యం ఏర్పడింది. ఇలా మిత్రపక్షాల మీద ఆధారపడితే వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చాల్సి వస్తుందనేది తెలిసిందే. ఇలా ఇతర పార్టీల మీద ఆధారపడటం బీజేపీ స్వభావానికి విరుద్ధం. ఈ తరుణంలో తృణమూల్‌లో ఫిరాయింపులు కలిసివస్తాయని చెప్పాల్సిన పనిలేదు. నితీశ్‌ను దారికి తెచ్చుకొని బీహార్‌లో బీజేపీ నేతను సీఎం గద్దెనెక్కించారు. ఇక మిగిలింది చంద్రబాబు. సొంత బలం పెంచుకొనేందుకు టీఎంసీ ఎంపీలను చీల్చేందుకు పావులు కదుపుతుండ టం బీజేపీ రాజకీయ నైతికతకు నిదర్శనం.

# విపక్షాలకు ఒకే మాట, ఒకే బాట ఏదీ?

ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి సమావేశంలో వాడిపోయిన ముఖంతో కనపడ్డ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ గట్టిగా హత్తుకున్నారు. ఒక స్త్రీ మనసును మరో స్త్రీ తప్ప మరెవరు అర్థం చేసుకోగలరు? 'కొన్ని దృశ్యాలను మాటల్లో చెప్పలేం' అని సీనియర్ నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు. ఈ ఇద్దరు మహిళలను గతంలో అంతర్జాతీయ సంస్థలు దేశంలోనే అత్యంత శక్తిమంతమైన నేతలుగా అభివర్ణించాయి. సోనియా పది సంవత్సరాలకు పైగా దేశ రాజకీయాలను శాసిస్తే, మమతా బెనర్జీ 15 సంవత్సరాలు బెంగాల్ రాజకీయాలను శాసించారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని వారికి తెలియనిది కాదు. గత నెలలో వెలువడిన అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ వ్యతిరేక శక్తులు మళ్లీ ఢిల్లీలో సమావేశమయ్యాయి. నిన్నటి వరకూ తాము కాంగ్రెస్‌ను కూడా ఢీకొన్న విషయాన్ని మరిచిన మమతా బెనర్జీ, వామపక్షాలు జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో చేతులు కలిపేందుకు సిద్ధమయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై రాహుల్‌గాంధీ ఇటీవలే తనను తీవ్రంగా విమర్శించిన విషయాన్ని మమతా బెనర్జీ మరిచిపోయినట్లే కనపడుతోంది. 'దేశంలో కాంగ్రెస్ నిర్వీర్యమైపోయింది. ఇక జాతీయ స్థాయిలో నేనే కీలక పాత్ర పోషిస్తాను' అని 2021లో ప్రధానమంత్రి పదవి గురించి కలలు కన్న విషయం కూడా ఆమెకు ఇప్పుడు గుర్తుండే అవకాశాలు లేవు. 1998లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి కోల్‌కతాలో ఏఐసీసీ ప్లీనరీ జరుగుతున్నప్పుడు ర్యాలీ నిర్వహించి పార్టీని ప్రకటించిన బెబ్బులి మమతా బెనర్జీ ఇప్పుడు కోరలు తీసేసినట్లే కనపడుతున్నారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో తృణమూల్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆమెపైనే తిరుగుబాటును ప్రకటించారు. ఆమె కుడిభుజం అభిషేక్ బెనర్జీ. ఎంపీ కల్యాణ్ బెనర్జీ తదితర తృణమూల్ నేతలపై వీధుల్లో దాడులు జరుగుతున్నాయి. మమత ఒకప్పుడు ప్రత్యర్థులపై అవలంబించిన విధానాలే ఇప్పుడు ఆమెపై ప్రత్యర్థులు ప్రయోగిస్తున్నారు. కోల్‌కతా వీధుల్లో ఇప్పుడు మమతా బెనర్జీ, ఆమె వర్గీయులు అరణ్య రోదన చేస్తుంటే వారికి అండగా ఇప్పుడు కాంగ్రెస్ నేతలే నిలిచే పరిస్థితి ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో అటు రాష్ట్రంలోనూ, ఇటు ఢిల్లీలోనూ బీజేపీ వంటి మహాశక్తిని ఎదుర్కోవాలంటే కాంగ్రెసే శరణ్యమని మమతా బెనర్జీ గ్రహించినట్లు కనపడుతోంది. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు సీట్లు పెద్దగా గెలుచుకోనప్పటికీ తృణమూల్‌ను బాగా దెబ్బతీయగలిగాయి. ముర్షిదాబాద్, మాల్డా, ఉత్తర్ దినాజ్‌పూర్ లాంటి మైనారిటీల ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్--వామపక్ష కూటమి తృణమూల్‌కు సంప్రదాయంగా లభించే మద్దతు రాకుండా చూశాయి. 50శాతానికి పైగా ముస్లింల జనాభా ఉన్న 32 అసెంబ్లీ స్థానాల్లో తృణమూల్ ఒక్క సీటును కూడా గెలుచుకోలేదు. జంగీపూర్ అనే నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 31వేల ఓట్లు రాగా తృణమూల్ అభ్యర్థికి 10,542 ఓట్లు మాత్రమే లభించాయి. అదే కరండిఘి అనే నియోజకవర్గంలో సీపీఐ(ఎం)కు 39వేల ఓట్లు రాగా, ఆ పార్టీ అభ్యర్థిపై బీజేపీ అభ్యర్థి 20వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. బహుశా ఈ ఫలితాలు వచ్చిన తీరు మమతా బెనర్జీకి తన అహంకారం, దౌర్జన్యపూరిత ధోరణి, మిత్రపక్షాలను లెక్కచేయనితనం గురించి గుణపాఠాలు నేర్పే ఉంటుంది. అందుకే ఆమె ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో కనపడుతున్నారు. ఇక దేశంలో తమ కాళ్ల కింద నేల క్రుంగిపోతున్న వామపక్షాలకు కూడా ఢిల్లీ వీధులే శరణ్యంగా మారాయి. 140 సీట్లున్న కేరళ అసెంబ్లీలో కాంగ్రెస్




నేతృత్వంలోని యూడీఎఫ్ 100 సీట్లకు పైగా గెలుచుకోవడం, బీజేపీ మూడు సీట్లు గెలుచుకోవడం, పినరయి విజయన్ కేబినెట్‌లో అత్యధిక మంత్రులు పరాజయం పాలుగావడం విస్మరించదగ్గ విషయం కాదు. అక్కడ కూడా పినరయి విజయన్ పదేళ్ల కేంద్రీకృత అహంకార పాలన, రైతులు, యువత, ఆశా వర్కర్లు తీవ్ర నిరుత్సాహానికి గురికావడం, పార్టీ కేడర్ అసంతృప్తి... వంటివి వామపక్ష కూటమి పరాజయానికి కారణమని విశ్లేషకులు అభివర్ణించారు. పినరయి విజయన్ బీజేపీతో కుమ్మక్కయ్యారని, అవినీతిపరులను ప్రోత్సహిస్తున్నారని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వంటి కాంగ్రెస్ నేతలు విమర్శించారు. విజయన్‌పై కేంద్ర ఏజెన్సీలు ఎందుకు విచారణ జరపలేదని ప్రశ్నించారు. ఏమైతేనేం అయిదు దశాబ్దాల తర్వాత దేశంలో ఎక్కడా అధికారంలో లేని పరిస్థితికి వచ్చిన వామపక్షాలు బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేయడం తప్ప తమకు మరో మార్గం లేదని గ్రహించాయి. ఇండియా కూటమి సమావేశానికి హాజరైన వామపక్ష నేతలు డి.రాజా, జాన్ బ్రిటాస్‌కు ఆ స్పష్టత ఉన్నది. దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితిని రెండేళ్ల క్రితం మరణించిన సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి బాగా అర్థం చేసుకున్నారు. సీపీఐ(ఎం) బహిష్కరించిన ప్రసేనజిత్ బోస్‌ను కాంగ్రెస్ తన పార్టీలో చేర్చుకున్నప్పుడు 'మీ కామ్రేడ్‌ను మేము మా పార్టీలో చేర్చుకున్నాం' అని రాహుల్‌గాంధీ ఏచూరితో పరిహాసమాడారు. 'మీ వాడు, మా వాడు అనేది ఏముంది, ఈ పోరులో మనమిద్దరమూ ఒకే పడవలో ప్రయాణిస్తున్నాం' అని ఏచూరి నవ్వుతూ జవాబిచ్చారు. దేశంలో బీజేపీ అడ్డూ ఆపూ లేకుండా దూసుకువస్తున్న పరిస్థితుల్లో ఆ పార్టీని ఎదుర్కొనేందుకు అన్ని బీజేపీ వ్యతిరేక శక్తులూ సంకుచిత ధోరణి వీడి కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన ఎప్పుడో గ్రహించారు. ఇవాళ ఎన్డీఏలో ఉన్న పార్టీలేవీ ఎన్నికల్లో పరస్పరం పోటీపడడం లేదు. కానీ ఇండియా కూటమిలో ఉన్న పార్టీలకు ఆ మేరకు సమైక్యత లేదు. దాదాపు రెండేళ్ల తర్వాత ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో సమావేశమైన 23 పార్టీలకు ఎంత మేరకు లక్ష్యశుద్ధి ఉన్నది? డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీలు హాజరు కాకపోవడంలో మర్మం ఏమిటి? ఎమర్జెన్సీ అనంతరం 1977లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఒకే ఎన్నికల గుర్తుపై జనతా పార్టీ పేరుతో పోటీ చేశాయి. అప్పటి చిత్తశుద్ధి, పోరాట స్ఫూర్తి ఇప్పుడు ఎన్ని పార్టీలకు ఉంది? మిత్రపక్షాలను కూడా తన సైద్ధాంతిక బాటలో నడిపించగలిగిన బీజేపీ మాదిరి కాంగ్రెస్ ఇతర పార్టీలకు సారథ్యం వహించగలదా?

ఇండియా కూటమి సమావేశం జరిగిన రెండు రోజుల తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశాన్ని ఏర్పరిచారు. పేరుకు ఇది ఎన్డీఏ సమావేశమైనా, జరుగుతోంది బీజేపీ సమావేశమే. నాగాలాండ్, మేఘాలయ, పుదుచ్చేరి వంటి చిన్న రాష్ట్రాలను పక్కన పెడితే ఎన్డీఏ పాలన అమలులో ఉన్న అతి పెద్ద రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే. నిన్నమొన్నటి వరకు బిహార్‌లో జనతాదళ్(యు) అధినేత నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉండేవారు. ఇప్పుడు అక్కడ కూడా బీజేపీ నేతే ముఖ్యమంత్రిగా ఉన్నారు. నితీశ్ రాజ్యసభకు రావడంతో లోక్‌సభలో ఉన్న 12 మంది జేడీ(యు) ఎంపీలకు మోదీయే నాయకుడుగా భావించవలసి ఉంటుంది. లోక్‌సభలో 28 మంది తృణమూల్ ఎంపీలు ఉండగా, ఆ పార్టీ చీఫ్ విప్ కాకోలీ ఘోష్ దస్తిదార్ నేతృత్వంలోని 20 మంది ఎంపీలు మమతా బెనర్జీపై తిరుగుబాటు చేసి తమను ప్రత్యేక గ్రూప్‌గా గుర్తించమని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని నిర్ణయించారు. వీరు కూడా ఏ సుముహూర్తాన్నో బీజేపీలో చేరి, ఆ పార్టీ ఎంపీలుగా కాషాయ కండువా కప్పుకోక తప్పదు. అంటే బీజేపీకి తెలుగుదేశం ప్రమేయం లేకుండానే ఇప్పటికే లోక్‌సభలో పూర్తి మెజారిటీ వచ్చినట్లే లెక్క.

అంతేకాక శివసేనకు చెందిన ఏడుగురు, లోక్ జనశక్తికి చెందిన అయిదుగురు, జనతాదళ్ సెక్యులర్‌కు చెందిన ఇద్దరు, రాష్ట్రీయ లోక్‌దళ్‌కు చెందిన ఇద్దరు, ఎన్‌సీపీ పవార్ గ్రూప్‌కు చెందిన ఒక్కరు, అప్నాదళ్, హిందూస్థానీ ఆవామీ మోర్చాకు చెందిన ఇద్దరితో పాటు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన ఆరుగురు ఇప్పటికే బీజేపీకి మద్దతునిస్తున్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక శివసేన, ఎన్‌సీపీ, లోక్ జనశక్తి, రాష్ట్రీయ లోక సమతా పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ వంటి పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన ఘనత, పలువురు ఇతర పార్టీల నేతలను తమతో పాటు కలుపుకున్న ఘనత భారతీయ జనతా పార్టీకి దక్కింది. అంతే కాదు, మోదీ హయాంలోనే బీఎస్పీ, బీజేడీ, అన్నాడీఎంకేతో పాటు పలు ప్రాంతీయ పార్టీల భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. మోదీకి దాసోహం అనకపోతే తమ మనుగడ కష్టమని పలు ప్రాంతీయ పార్టీలు భావించే పరిస్థితి దేశంలో నెలకొంది.

ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన నేడు 13వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న దృష్ట్యా ఆయన రాజకీయాలు ఇంకెంత తీవ్ర స్థాయిలో ఉంటాయో అన్న విషయమై సోషల్ మీడియాలో వ్యాఖ్యలు, కాక్రోచ్ జనతా పార్టీ వంటి పరిణామాలు, ప్రజాస్వామ్య సంస్థలు బలహీనపడడం, న్యాయవ్యవస్థ లొంగిపోయిందనే ఆరోపణలు, నీట్, సీబీఎస్ఈ వంటి సంస్థలు పరీక్షలను నిర్వహించలేని వైఫల్యంపై ఎన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నప్పటికీ రాజకీయంగా మోదీ బలం రోజురోజుకూ పెరుగుతోందనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. అంతర్వైరుధ్యాలను తొలగించుకోకుండా, సమాన ప్రత్యామ్నాయ దృక్పథాన్ని ఏర్పరుచుకోకుండా ఎన్ని సమావేశాలు నిర్వహించినప్పటికీ ప్రతిపక్షాలు కానీ, ఇతరేతర శక్తులు కానీ ఏ మార్పును సాధించగలుగుతాయి?

అగ్నిధార
http://www.agnidharanews.com

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం వార్డు బాట పడతా

**కౌన్సిలర్లు ప్రజలకు సేవలందించాలి**
**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం**

అగ్నిధారన్యూస్ సుల్తానాబాద్

సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 1,13,14,15 వార్డులకు సంబంధించిన వార్డు సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, ప్రభుతవిప్ చింతకుంటవిజయ రమణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ..మున్సిపల్ కౌన్సిలర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో పని చేయాలని అన్నారు. వచ్చే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, నాళాలు ఎప్పటికప్పుడు శుభపరచుకోవాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తాను త్వరలోనే వార్డు బాట పడతానని చెప్పారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో నాలుగైదు రోజులు పర్యటిస్తానని అన్నారు. కౌన్సిలర్లు ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఆయా వార్డుల్లో త్వరలోనే సిసి రోడ్ల నిర్మాణం ప్రారంభం అవుతుందన్నారు. ఇప్పటికే పట్టణంలో రోడ్ల వెడల్పు, సిసి రోడ్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నట్టు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని స్పష్టం చేశారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 3 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను ఎలాంటి కటింగులు లేకుండా అనేక సమస్యలను అధిగమిస్తూ కొనుగోళ్లు పూర్తిచేసి, రైతుల సేవలో తరించినట్టు ఎమ్మెల్యే గారు తెలిపారు. రైతు భరోసా, రైతు భీమా, సన్న వడ్లకు బోనస్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదేనని చెప్పారు. రాబోయే రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతుండగా, బీఆర్ఎస్ ఓరువలేకపోతుందని చెప్పారు. ప్రతిపక్షాల ధర్నాలకు రైతులు రావడంలేదని స్వయంగా ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొనడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో సి ఎం సభకు బయలు దేరిన శ్రేణులు



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగే ఫ్యూచర్ సిటీ బహిరంగ సభకు తలకొండ పల్లి మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బయలుదేరిన అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు వెల్జాల్ మరియు వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా సంఘల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెండా ఊపి ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి,ఈ కార్యక్రమంలో, వెల్జాల్ మాజీ ఉప సర్పంచ్ అజీజ్ నాయకులు పబ్బతి వెంకటయ్య, వద్దే రాజు, బాద్రముని అనిల్ కుమార్ ముదిరాజ్, లింగం యాదవ్, కరీం షా ఖాద్రి, సొప్పరి శ్రీను, ముదిగొండ లక్ష్మయ్య మహిళా సంఘం నాయకురాలు టి కృష్ణవేణి, ఏ.కల్పన, శ్రీవాణి, రాణి, గన్నోజు రమాదేవి, చిలకం జయమ్మ ,సువర్ణ ,సత్త్యమ్మ,తదితరులు బయలుదేరారు.

# అనాథ బాలికలకు ఉచిత రెసిడెన్షియల్ విద్యా వరం



**ఉప్పల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)


తలకొండపల్లి, మండల పరిధిలోని అనాథ, అర్ధానాథ బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఉప్పల ఆశ్రమ పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్-మంజుల తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పూర్తి రెసిడెన్షియల్ విధానంలో విద్య అందించనున్న ఈ పాఠశాలలో తల్లిదండ్రులు లేని బాలికలు, తండ్రి లేని బాలికలకు ప్రవేశాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వెల్లడించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రాష్ట్ర సిలబస్ ఆధారంగా ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతుందని తెలిపారు. విద్యార్థినులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలతో పాటు సురక్షితమైన విద్యా వాతావరణం కల్పిస్తున్నామని, బాలికల విద్యాభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 92475 76774 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**సుంకిరెడ్డి సహకారంతో ఉచిత పోలీస్ శిక్షణ మెటీరియల్ పంపిణీ**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వెల్దండ మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రంలో అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొని అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేశారు,ఈ సందర్భంగా గౌరవధ్యక్షుడు అంకిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని,యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉచిత పోలీస్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా, నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ,ఉచిత స్టడీ మెటీరియల్, అవసరమైన మార్గదర్శకత్వాన్ని కూడా అందిస్తున్నారని తెలిపారు, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిత్యం యువతకు అండగా నిలుస్తూ, వారి ఉద్యోగ సాధన కోసం ఉపాధి వనరులను సమకూరుస్తు సేవలు అందించడం అభినందనీయమని,గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాల యువత కూడా పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనే ఉద్దేశంతో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో మందికి ఆశాకిరణంగా మారాయని పేర్కొన్నారు,ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలనే లక్ష్యంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో శిక్షణ పొందితే తప్పకుండా విజయాన్ని అందుకోవచ్చని సూచిస్తూ ఈ సందర్భంగా మాడుగుల యువతకు ఇంత గొప్ప కార్యక్రమాన్ని అందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు,



అభ్యర్థులు మాట్లాడుతూ, ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్ అందించడం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు,ఆర్థిక ఇబ్బందుల కారణంగా మెటీరియల్ కూడా సమకూర్చుకోలేని విద్యార్థులకు గొప్ప అవకాశాన్ని సుంకిరెడ్డి అందిస్తున్నారని,యువత కోసం నిరంతరం గొప్ప కార్యక్రమాలు చేపడుతూ తమలాంటి నిరుద్యోగులకు అండగా నిలుస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు,లెక్చరర్ల బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో భాగంగా సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ సభ




అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని దేవునిపడకల్ గ్రామంలో సర్పంచ్ కానుగుల అనిత మల్లేష్ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక లో భాగంగా గ్రామసభ నిర్వహించడం జరిగింది. ఈ గ్రామసభ లో పలు అంశాలు చర్చించడం జరిగింది గ్రామం లో పారిశుధ్యం గురించి రానున్న వర్షాకాలం లో వచ్చేటటువంటి సీజనల్ వ్యాధులపై అవగాహనా కల్పించడం జరిగింది అదేవిదంగా తడిచెత్త పొడిచెత్త వేరు వేరు గా చేయాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో, ఉప సర్పంచ్ అంబటి వెంకటేష్ వార్డుసభ్యులు స్వామి గౌడ్ కడమోని రాము అంబటి లక్ష్మయ్య కానుగుల మాధవి మల్లేష్ రాజమోని జ్యోతి లక్ష్మయ్య మధూరి మాధవి మహేష్ రాజమోని మంజుల శ్రీనివాస్ గారు, ఉపాధి హామీ అధికారులు పంచాయతీ కార్యదర్శి లింగస్వామి ఎ ఎన్ ఎం విజయలక్ష్మి ఆశ వర్కర్ యాదబాబు విద్యాకమిటి చైర్మన్ స్రవంతి మెట్ శ్రీను గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్రాభివృద్ధి

**ఎంపీడీఓకు శాలువాతో సన్మానం చేసిన స్థానిక సర్పంచ్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామాశీలో సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో సీతారమమ్మ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, ప్రజలు చైతన్యవంతంగా ముందుకు వస్తేనే ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతాయని ఎంపీడీఓ సితరమమ్మ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని పడకల్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. నిర్వహించిన గ్రామసభల్లో ప్రజాపాలన ప్రగతి నివేదికను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. గ్రామస్థులు తమ సమస్యలు, అవసరాలు, సూచనలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. గ్రామసభలు ప్రజలకు తమ అభిప్రాయాలను వెల్లడించే వేదికగా నిలుస్తాయని, ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా పనిచేస్తాయని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేస్తున్నారని, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని ఎంపీడీఓ సీతరమమ్మ కోరారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వహణ అనంతరం ఎంపీడీఓను శాలువాతో ఘనంగా సన్మానించిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అభినందనలు తెలిపారు. గ్రామాభివృద్ధికి అధికారులు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఉప సర్పంచు వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, యువత, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఉప్పల ట్రస్ట్ ద్వారా నిరుపేద కుటుంబానికి సిమెంటు బస్తాలు అందజేత

**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కడ్తాల్ మండలలోని రావిచెడు గ్రామపంచాయతీ కి చెందిన చెన్న మౌని ముని సరూప భర్త చెన్నయ్య నిరుపేద కుటుంబానికి చెందినవారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడంతో స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు ద్వారా రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వై వైస్ చైర్మ న్ ఉప్పల వెంకటేష్ తన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సిమెంట్ ఇవ్వడం జరిగింది. ఈ రోజు నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణం కోసం భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇంటి నిర్మాణానికి సిమెంటు బస్తాలు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆ కుటుంబ సభ్యులు ఉప్పల వెంకటేష్ కి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో,సర్పంచ్ బొప్పిడి గోపాల్ మార్చా శేఖర్ తదితరులు పాల్గొన్నారు



# నిరుపేద కుటుంబానికి అండగా సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలం లోని లింగరావుపల్లి గ్రామ పంచాయతీకీ చెందిన బండగల్ల శ్రీధర్ తండ్రి దశరధం నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి ఇంటి నిర్మాణం కోసం సిమెంట్ అందజేసిన గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి నిరుపేద కుటుంబాలకు ఇంటి నిర్మాణంలో భాగంగా పూర్తి ఇంటి నిర్మాణానికి సిమెంట్ ఇప్పించడం జరిగింది.

ఈ సందర్భంగా సహాయం పొందిన కుటుంబ సభ్యులు సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపడం జరిగింది. ఈ కార్యక్రమంలో,స్థానిక కాంగ్రెస్ నాయకులు తది తరులు పాల్గొన్నారు.



# మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

బుధవారం కమాన్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో కమాన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గాండ్ల మోహన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులపై రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించకుండా వ్యక్తిగత ఆరోపణలకు దిగడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందిన నాయకులపై అసత్య ప్రచారాలు చేసినంత మాత్రాన వాస్తవాలు మారవని, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం మరింత బలంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుపై పుట్ట మధు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి, సంక్షేమ



కార్యక్రమాలను అమలు చేస్తున్న నాయకులపై ఆధారాలు లేని విమర్శలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. మంథని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, వ్యక్తిగత ఆరోపణల కంటే ప్రజా సమస్యలపై మాట్లాడితే మంచిదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఎలాంటి దుష్ప్రచారం చేసినా ప్రజల మద్దతు తగ్గదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కమాన్పూర్ మత్స్యశాఖ చైర్మన్ గడప కృష్ణమూర్తి మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాజీ ఎంపీటీసీ శివ శంకరయ్య మల్యాల మహేష్ గౌడ్, సిద్ది పల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, ఏం సి డైరెక్టర్ దాసరి గట్టయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చాట్ల గట్టయ్య, వెంగలి రాజయ్య గౌడ్, నగునూరి నరసయ్య గౌడ్, ఇనగంటి ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం

**మత్తు వ్యసనాల నుంచి యువతను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ: డీసీపీ బి. రామ్‌రెడ్డి**

**గోదావరిఖని డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన అధికారులు**

**అగ్నిధార న్యూస్ ( రామగుండం):**

గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి సమాజం సహకరించాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలోని డి-అడిక్షన్ సెంటర్‌ను డీసీపీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న యువకులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, చికిత్స విధానం, కౌన్సెలింగ్ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షల్లో పాజిటివ్‌గా తేలిన వారిని గౌరవ న్యాయస్థానం ఆదేశాల మేరకు 15 రోజుల పాటు డి-అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నట్లు వెల్లడించారు. అక్కడ వైద్య చికిత్సతో పాటు మానసికంగా మార్పు తీసుకురావడానికి ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిపుణులైన వైద్యుల సహాయంతో మత్తు వ్యసనానికి గురైన వ్యక్తులు తిరిగి సాధారణ జీవన విధానంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని డీసీపీ చెప్పారు. గంజాయి వినియోగదారులను గుర్తించి వారిని ఆ అలవాటు నుంచి దూరం చేయగలిగితే, మత్తు పదార్థాల సరఫరాను కూడా నియంత్రించవచ్చని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు స్పందించి నిందితులపై కేసులు నమోదు చేయడంతో పాటు నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైతే వారిని డి-అడిక్షన్ కేంద్రాలకు తరలించి చికిత్స అందించే చర్యలు తీసుకుంటారని వివరించారు. డ్రగ్స్ రహిత పెద్దపల్లి జిల్లాను నిర్మించడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డీసీపీ పిలుపునిచ్చారు. ఈగల్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, నార్కోటిక్ పెద్దపల్లి ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డి-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న వారితో కలిసి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా మొక్కలు నాటారు. మొక్కల సంరక్షణ ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భావితరాలకు అందించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## హక్కుల పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కె. బాలగోపాల్

**జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్,(పెద్దపల్లి):**

భారతదేశంలో పౌరహక్కుల ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది, గణిత శాస్త్రవేత్త, గొప్ప ఆలోచనాపరుడు కందళ్ల బాలగోపాల్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కె. బాలగోపాల్ జయంతి సందర్భంగా బాలగోపాల్ సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. 1952 జూన్ 10న కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలో జన్మించిన బాలగోపాల్ స్వస్థలం అనంతపురం జిల్లా రాళ్ల అనంతపురం. తల్లిదండ్రులు నాగమణి, పార్థనాథశర్మ. ప్రముఖ సాహితీవేత్త రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ ఆయనకు మాతామహుడు కాగా, రచయిత్రి, మాజీ తెలుగు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మృణాళిని ఆయన సోదరి. ప్రముఖ పాత్రికేయురాలు వసంత లక్ష్మి ఆయన జీవిత భాగస్వామి. వరంగల్‌లోని అప్పటి రీజనల్ ఇంజినీరింగ్ కళాశాల (ప్రస్తుత ఎన్‌ఐటీ) నుంచి గణిత శాస్త్రంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన బాలగోపాల్, అనంతరం ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్-డాక్టోరల్ పరిశోధనలు నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారానికే తన జీవితాన్ని అంకితం చేశారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ) ప్రధాన కార్యదర్శిగా దాదాపు 15 సంవత్సరాల పాటు పనిచేసిన బాలగోపాల్, మానవ హక్కుల ఉల్లంఘనలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం సాగించారు. అనంతరం 1998లో మానవ హక్కుల వేదిక (హ్యూమన్ రైట్స్ ఫోరం) ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ అల్లర్ల నుంచి ఈశాన్య రాష్ట్రాల వరకు దేశవ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసేందుకు నిజనిర్ధారణ బృందాల్లో పాల్గొని అనేక నివేదికలు రూపొందించారు. దళితులు, డా. దుర్గం నగేష్ పేర్కొన్నారు. ప్రజల తరఫున న్యాయపోరాటం చేయాలనే సంకల్పంతో న్యాయశాస్త్రం అభ్యసించి న్యాయవాదిగా మారిన బాలగోపాల్, చుండూరు దళిత నరమేధం, బూటకపు ఎన్‌కౌంటర్లు, లాకప్ మరణాలు వంటి అనేక కేసుల్లో బాధితుల తరఫున ఉచితంగా వాదించారు. రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. రచయితగా, విశ్లేషకుడిగా కూడా బాలగోపాల్ విశేష గుర్తింపు పొందారు. కుల వ్యవస్థ, ప్రజాస్వామ్యం, ఆర్థిక విధానాలు, సామాజిక న్యాయం, మానవ హక్కుల అంశాలపై ఆయన రచనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి పత్రికల్లో ఆయన రాసిన వ్యాసాలు సామాజిక, రాజకీయ విశ్లేషణకు కొత్త కోణాలను అందించాయని పేర్కొన్నారు. నిరాడంబర జీవనశైలిని అవలంబించిన బాలగోపాల్ సాధారణ ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి పనిచేశారని, తెలుగు సమాజానికి ఒక "వివేక సాక్షి"గా నిలిచారని డా. మార్షల్ దుర్గం నగేష్ కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, మానవ గౌరవం కోసం కె. బాలగోపాల్ చేసిన పోరాటం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డా. దుర్గం నగేష్ పిలుపునిచ్చారు.

## రంగంపేట గ్రామ సభలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం




**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం గజ్వేల్ మండలం రంగంపేట గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి పవన్ కుమార్ పాల్గొని గ్రామస్తులకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పించారు. చెట్లను నరికితే జరిమానా విధించడం జరుగుతుందని అడవిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని, ప్లాస్టిక్ నివారణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీవో, గ్రామ సర్పంచ్,పాలక వర్గం,కార్యదర్శి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రభంజనశీ

**ప్రిన్సిపాల్ బానోతు రాజన్న నాయక్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న నాయక్ ఆధ్వర్యంలో కళాశాలలో భారీగా అడ్మిషన్లు జరుగుచున్నవి కళాశాలలో ఎంపీసీ బీపీసీ , సీఈసీ , హెచ్ ఈసీ , ఏసి ఈ ఇంగ్లీష్ తెలుగు మీడియంలో వృత్తి విద్యా కోర్సులైన ఈటి ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రాజన్న అడ్మిషన్ల కోసం స్వయంగా తానే గ్రామ, గ్రామానికి తిరుగుతూ అడ్మిషన్ డ్రైవ్ లో భాగంగా పరిసర గ్రామాలలో పదవ తరగతి పాసైన విద్యార్థులకు అలాగే వారి తల్లిదండ్రులను గ్రామ సర్పంచ్ లకు , ప్రజా ప్రతినిధులకు కళాశాలలో ఉన్న వసతులు, నాణ్యమైన విద్య పైనా అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు కొరకు ఆర్వో ప్లాంట్, అధునాతనమైన సైన్స్ ల్యాబ్స్ సౌకర్యం,విశాలమైన క్రీడా మైదానం అలాగే అన్ని రకాలైన ఆటలకు కావలిసిన క్రీడా సామాగ్రి ఏర్పాటు చేసుకోవడం , విద్యార్థుల పోటీ పరీక్షల కొరకు అవసరమైన పుస్తకాలతో అధునాతన లైబ్రరీ ఏర్పాటు, ప్రతి క్లాస్ రూమ్ లో విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్స్ ట్యూబ్ లైట్స్ ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది అలాగే ప్రతి క్లాస్ రూమ్ లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నాణ్యమైన విద్య అందించడం దీనితోపాటు ఇంటర్ విద్యను బలోపేతం చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం బ్రేక్ ఫాస్ట్ మధ్యాహ్నం భోజనం, విద్యార్థుల కిట్ క్రింద రెండు జతల డ్రస్సులు, షు ,టై బెల్టు ఐడి కార్డులను అందించడం హర్షదాయకం అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యానభ్యసించడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో ఇంజనీరింగ్, ఫార్మసీ లాంటి విద్యను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని అనే విషయాలపై అవగాహన కల్పిస్తూ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత విద్యా బోధన జరుగుతున్నదని అలాగే కార్పొరేట్ స్థాయిలో జరిగే క్లాసులకు దీటుగా ఐడీపీ ఇఫ్ట్ ప్యానెల్స్ తో ఆన్లైన్ తరగతులు నిర్వహిస్తూ జె ఈఈ ,నీట్ ,ఎఆఫ్సెట్ అలాగే క్లాట్ వంటి క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మా అధ్యాపక బృందం అహర్నిశలు కృషి చేస్తుందని తెలియజేశారు ఇలాంటి వసతులు ఉన్నాయని తెలియజేయడం వల్ల గ్రామాలలోని తల్లిదండ్రులు తమ పిల్లల్ని కళాశాలకు పెద్ద మొత్తంలో అడ్మిషన్లు చేయుటకు ముందుకు వస్తున్నారు. అదేవిధంగా ఇలాంటి అవకాశాలని పరిసర గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ చాందీ కుమారి విజయ్ కుమార్ ,శ్రీలత ,శ్రీనివాస్, చారి ,శ్రీధర్ శేఖర్ మోహన్ దాస్, శ్రీనివాసరావు స్వామి సతీష్ ప్రకాష్ శ్రేయ మేఘన, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల ట్రస్ట్ ద్వారా నిరుపేదల కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల కేంద్రము లోని పోతు గంటి పెంటయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక నాయకుల తో కలిసి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ ఛైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ మర్యాద పూర్వకంగా కలవడంతో వెంటనే స్పందించి నిర్మాణంలో భాగంగా ప్రతి పేదోడి సొంత ఇంటి కల నెరవేర్చలానే సంకల్పంతో వారి ఇంటికి సరిపడ సీకులు ఇప్పించడం జరిగింది. సిమెంట్ కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు కార్యకమంలో, గ్రామ సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్ ముదిరాజ్, వార్డు సభ్యులు పోతుగంటి కుమార్, మల్లీశ్వరి జంగయ్య, వెంకటేష్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు

## పేద కుటుంబానికి సుందరం ఫౌండేషన్ సహాయం



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

కమాన్పూర్ మండలం సిద్దిపల్లె గ్రామపంచాయితీ పరిధిలోని పేద కుటుంబానికి చెందిన బూర్ల రాజయ్య తమ్ముడు, బూర్ల లింగయ్య, వయసు 36 సంరాలు. అనారోగ్యంతో మరణించిన వార్త మాడిశెట్టి స్వామి ద్వారా సమాచారం అందుకున్న మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, తన ఫౌండేషన్ సభ్యులను పంపి వారి కుటుంబ సభ్యులని పరామర్శించి వారికి నిత్యవసర సరుకులు, 25 కిలోల బియ్యం సిద్దిపల్లె గ్రామ సర్పంచ్ భర్త బంగారు మహేష్ చేతుల మీదుగా ఈరోజు అందజేశారు. ఈకార్యక్రమంలోబంగారుమహేష్, ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కన్నూరి నగేష్, స్వామిలతో పాటు ఫౌండేషన్ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సేవలు ఎనలేనివి




**సర్పంచ్ సోప్పరి పుష్ప తానేష్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండలం కొండాపూర్ గ్రామంలో బదిలీ పై వెళుతున్న పంచాయతీ కార్యదర్శి నవీన్ నూతనశీగా బాధ్యతలు తీసుకున్న కార్యదర్శి ఐలేని ని సర్పంచ్ సోప్పరి పుష్ప తానేష్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి నవీన్ సేవలు మరువలేనివని ప్రజల సమస్యలు ఉన్నాయని సెక్రటరీ దగ్గరికి వెళ్లితే వెనువెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేసే వారని, అదేవిధంగా ఎక్కడ ఉన్న మంచి పేరు ప్రాక్యతలు తెచ్చుకోవాలని అన్నారు. గ్రామ ప్రజలతో ప్రేమ ఆప్యాయంగా పలకరిస్తూ గ్రామ ప్రజలకు చేరువై ఉండేవారనీ కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ తీగుళ్ల జహంగీర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సేవలు ఎనలేనివి

**సర్పంచ్ సోప్పరి పుష్ప తానేష్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండలం కొండాపూర్ గ్రామంలో బదిలీ పై వెళుతున్న పంచాయతీ కార్యదర్శి నవీన్ ని సర్పంచ్ సోప్పరి పుష్ప తానేష్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి నవీన్ సేవలు మరువలేనివని ప్రజల సమస్యలు ఉన్నాయని సెక్రటరీ దగ్గరికి వెళ్లితే వెనువెంటనే స్పందించి సమస్యలు పరిష్కారం చేసే వారని గ్రామ ప్రజలతో ప్రేమ ఆప్యాయంగా పలకరిస్తూ గ్రామ ప్రజలకు చేరువై ఉండేవారనీ కొనియాడారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ తీగుళ్ల జహంగీర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత వ్యాపారులకు సమాజం అండగా నిలవాలి

**కాజీపేటలో నూతన సారీ స్టాల్‌ను సందర్శించిన సమతా ఫౌండేషన్ ప్రతినిధులు**

**అగ్నిధార న్యూస్,(కాజీపేట):**

చేనేత రంగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర నాయకులు, సమతా ఫౌండేషన్ నిర్వాహకులు దుర్గం నగేష్, దుర్గం ప్రమీల దంపతులు పిలుపునిచ్చారు. బుధవారం కాజీపేట నిట్ కాలేజ్ ఏరియాలో నిర్వహిస్తున్న చేనేత వస్త్ర కళా ప్రదర్శనలో తమ సభ్యులు దుర్గం వెంకటస్వామి--నవ్య దంపతులు నూతనంగా ప్రారంభించిన సారీ స్టాల్‌ను వారు సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా స్థానిక కళాకారులు, చిన్న వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం అవుతారని అన్నారు. దుర్గం వెంకటస్వామి, నవ్య దంపతులు ప్రారంభించిన ఈ వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సమతా సైనిక్ దళ్, సమతా ఫౌండేషన్ సభ్యులు అందుబాటులో ఉన్నంత మేర ఈ స్టాల్‌కు సహకారం అందించాలని, చేనేత వస్త్రాల కొనుగోలు ద్వారా స్వదేశీ ఉత్పత్తులను ఆదరించాలని కోరారు. చేనేత రంగం కేవలం ఉపాధి మార్గమే కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. చేనేత కార్మికుల కృషికి తగిన గుర్తింపు రావాలంటే ప్రజలు చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంచాలని, ప్రభుత్వాలు కూడా ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్, సమతా ఫౌండేషన్ సభ్యులు జిమ్మిడి , స్రవంతి, సల్లూరి అది లక్ష్మీ , స్థానికులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# ప్రాణాల కంటే వేగం ముఖ్యం కాదు.. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి

**యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడటం అందరి బాధ్యత: డీసీపీ బి. రామ్‌రెడ్డి**

**హనుమంతునిపేట గ్రామసభలో రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

ప్రాణాల కంటే వేగం ముఖ్యమైనది కాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడంతో పాటు, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి సూచించారు. అలాగే యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల సందర్భంగా, రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని హనుమంతునిపేట గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు డీసీపీ బి. రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్--అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ ధరించడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. తల్లిదండ్రుల పట్ల గౌరవం, గురువుల పట్ల భక్తి కలిగిన విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.




ప్రస్తుతం మాదకద్రవ్యాల వ్యసనం యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన పిల్లల్లో ప్రవర్తనలో గణనీయమైన మార్పులు కనిపిస్తాయని, ఇంట్లో వస్తువులు ధ్వంసం చేయడం, తల్లిదండ్రులను బెదిరించడం, అవసరం లేని డిమాండ్లు చేయడం, మానసిక ఒత్తిడికి గురిచేయడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.అటువంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు భయపడకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని, పోలీసులు అవసరమైన కౌన్సెలింగ్ అందించడంతో పాటు వైద్య నిపుణులు, మనోవైద్యుల సహకారంతో పిల్లలను సరైన మార్గంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు.డ్రగ్స్ బారిన పడిన యువతలో కనిపించే లక్షణాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, నిపుణులు ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నారని, అలాంటి సంకేతాలు కనిపించిన వెంటనే తల్లిదండ్రులు స్పందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కఠిన చర్యలు చేపడుతోందని వివరించారు.ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని డీసీపీ పునరుద్ఘాటించారు. అదే సమయంలో రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్వేత, ఆరోగ్య శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యాశాఖ ప్రధానోపాధ్యాయులు, నీటిపారుదల శాఖ అధికారులు, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మత్తు రహిత సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలి

**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: డీసీపీ బి. రామ్‌రెడ్డి**

**ఈగల్ ఫోర్స్, అటవీశాఖ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

మత్తు రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు బుధవారం పెద్దపల్లి పట్టణంలోని చందపల్లి దర్గా ప్రాంగణంలో ఈగల్ ఫోర్స్, అటవీ శాఖ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమంతో పాటు మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డీసీపీ బి. రామ్‌రెడ్డి, ఏసీపీ జి. కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ వ్యవస్థ, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయని వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని



సూచించారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకుంటూ సమాజ అభివృద్ధిలో యువత తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని డీసీపీ కోరారు. మత్తు పదార్థాల నియంత్రణలో పోలీసు శాఖతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని పేర్కొన్నారు. మత్తు రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు చైతన్యవంతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా చందపల్లి దర్గా ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. హరితహారం వంటి కార్యక్రమాల విజయవంతమైన అమలుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, ఈగల్ ఫోర్స్ సిబ్బంది, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక పెద్దలు, పోలీసు సిబ్బంది, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ఆహ్వానించబడిన వ్యక్తులు పాల్గొన్నారు.మత్తు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# అమ్మానాన్నల కష్టానికి పిల్లలే గొప్ప బహుమతి

**టెన్త్ టాపర్లతో తల్లిదండ్రులకు ఘన సన్మానం**

**'అమ్మా నాన్నకు ప్రేమతో' కార్యక్రమంలో భావోద్వేగ ప్రసంగం చేసిన కందుల సంధ్యారాణి**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

"మనిషి ఎంత ఉన్నత స్థాయికి ఎదిగినా తనకు జన్మనిచ్చిన అమ్మానాన్నలను ఎన్నటికీ మరువకూడదు. పిల్లల విజయం వెనుక తల్లి కన్నీళ్లు, తండ్రి కష్టాలు దాగి ఉంటాయి" అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి అన్నారు.మంగళవారం రామగుండం నియోజకవర్గంలో నిర్వహించిన "అమ్మా నాన్నకు ప్రేమతో" పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన టాపర్లను అభినందించి, వారి తల్లిదండ్రులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం భావోద్వేగాల నడుమ సాగింది.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, నేటి తరం విద్యార్థులు చదువులో రాణించడమే కాకుండా కుటుంబ విలువలను, సంస్కారాన్ని కూడా అలవర్చుకోవాలని సూచించారు. టెన్త్ క్లాస్ జీవితం మొత్తాన్ని నిర్ణయించే అంతిమ గమ్యం కాదని, అది భవిష్యత్ విజయాలకు ఒక పునాది మాత్రమేనని పేర్కొన్నారు.


కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ ప్రయాణం విద్యార్థులకు ఆదర్శమని కొనియాడారు. ఢిల్లీలో జాతీయ స్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ సొంత ప్రాంత ప్రజల పట్ల ఆయనకు ఉన్న అనుబంధం అభినందనీయమని అన్నారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషి యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.గత 20 ఏళ్లుగా ప్రజలతో తనకు ఏర్పడిన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సంధ్యారాణి భావోద్వేగానికి గురయ్యారు. ప్రజా సేవలో తన ప్రయాణం పదవుల కోసం కాదని, సమాజం పట్ల ఉన్న బాధ్యతతోనే కొనసాగుతోందని స్పష్టం చేశారు.కరోనా మహమ్మారి సమయంలో ప్రజల కోసం చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త కందుల పోషం అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. "ఆ సమయంలో ఆయన నాకు అండగా నిలవడం వల్లే నేను సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను. అందుకే ఆయన నాకు దేవుడితో సమానం" అని అన్నారు.దపదవులు శాశ్వతం కావని, ప్రజల ప్రేమాభిమానాలే తనకు నిజమైన సంపద అని పేర్కొన్నారు. తల్లిదండ్రుల త్యాగాలను గుర్తుంచుకొని వారి ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు."రేపు మీరు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వైద్యులు, శాస్త్రవేత్తలు లేదా దేశాన్ని నడిపించే నాయకులుగా ఎదిగినా, మీ కోసం జీవితాంతం శ్రమించిన అమ్మానాన్నలను గుండెల్లో పెట్టుకోవడమే వారికి ఇచ్చే గొప్ప బహుమతి" అని విద్యార్థులకు సూచించారు.విద్యతో పాటు విలువలను కూడా పిల్లలకు అందించాలని తల్లిదండ్రులను కోరిన ఆమె, ఈ కార్యక్రమం ద్వారా అందజేస్తున్న జ్ఞాపికలు కేవలం పురస్కారాలు మాత్రమే కాదని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం కన్స్ట్రక్షన్స్ అధినేత మాచిడి మహేందర్, గాండ్ల రాములు, సూర్యదేవర జ్యోతి, బీఎంఎస్ నాయకులు సాగర్‌రాజు, సత్యనారాయణ రెడ్డి, పెరిక సంఘం జిల్లా అధ్యక్షుడు దుండె మల్లేష్, పోతరాజుల అంజయ్య, బీజేపీ సీనియర్ నాయకులు ముసుకుల భాస్కర్‌రెడ్డి, తడగొండ నరసయ్య, ఊరగొండ అపర్ణ, గుండబోయిన భూమయ్య, బోడకుంట సుభాష్, మెరుగు నరేష్ గౌడ్, ఆకుల శశి, నాయకులు కోడూరి రమేష్, జక్కన బాలు, జక్కుల పద్మ, కండె సాగర్, బూడిద హర్ష, బియ్యాల మహేందర్, మీస వికాస్, సిలారపు కళ్యాణ్, పరకాల మురళి గౌడ్, అందే రాజ్‌కుమార్ చారి, మూకిరి రాజు, ఎల్తూరి సరిత-రాజయ్య, జక్కుల ప్రవీణ్, అనుమాండ్ల వెంకటేష్, గోపు రామన్న, కొలిపాక శంకరయ్య, గోపతి ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదగాలి...

**ధ్రువీకరణ పత్రాలు అందజేసిన మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

క్రీడాకారులు అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర జాతీయ స్థాయిలకు ఎదగాలని కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని మినీ స్టేడియంలో గత 30 రోజులుగా నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది.ఈ కార్యక్రమానికి కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై క్రికెట్ అసోసియేషన్ సభ్యులతో కలిసి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తుందని క్రీడాకారులు లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని అన్నారు. క్రీడాకారులు క్రీడల్లో రాణిస్తే గొప్ప గుర్తింపుతో పాటు ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని



పేర్కొన్నారు. కల్వకుర్తి మినీ స్టేడియాన్ని స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అన్ని రకాల మౌళిక వసతులతో పాటు మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.వేసవి కాలంలో క్రీడాకారుల కోసం కల్వకుర్తి మినీ స్టేడియంలో క్రికెట్ అసోసియేషన్ సభ్యులు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు.రానున్న రోజుల్లో కల్వకుర్తి ప్రాంతం నుంచి గ్రామీణ క్రికెట్ క్రీడాకారులు రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తమ వంతు సహకరిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, యువజన కాంగ్రెస్ నాయకుడు దున్న సురేష్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్,హసన్, జహీర్,చేన్నకేశవులు,మహేష్ రెడ్డి,షఫీ,సీనియర్ క్రీడాకారులు రాజు,అతిఫ్ బారి,యశ్వంత్,లతో క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 22 తర్వాత సమ్మె

**కార్మిక సంఘాలతో చర్చించి సమ్మె కార్యాచరణ**

**31 డిమాండ్లతో యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చాం: కొరిమి రాజ్‌కుమార్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం):**

సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించకుంటే జూన్ 22 తర్వాత సమ్మెకు పిలుపునిస్తామని గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ హెచ్చరించారు. సమ్మె పిలుపుపై ఇతర కార్మిక సంఘాలతో చర్చించి ముందుకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు పూర్తయిన తర్వాత కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యంతో మూడు సార్లు డైరెక్టర్ (పర్సనల్) స్థాయిలో, రెండు సార్లు సీఎండీ స్థాయిలో సమావేశాలు నిర్వహించినప్పటికీ ఎలాంటి అంగీకారానికి రాలేదని తెలిపారు.కార్మికుల ఆందోళనల నేపథ్యంలో జూన్ 7, 8 తేదీల్లో కొత్తగూడెంలో జరిగిన ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సమావేశాల్లో సమ్మె నోటీసు ఇచ్చి ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఆ మేరకు పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం జూన్ 8న యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు అందజేసినట్లు చెప్పారు.సమ్మె నోటీసులో ప్రధానంగా సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, నిలిచిపోయిన మెడికల్ బోర్డులను నిర్వహించాలని, మారుపేర్లు, విజిలెన్స్ కేసుల కారణంగా ఉద్యోగాలకు దూరమైన కార్మికుల డిపెండెంట్లకు అలియాస్ పేర్లతో ఉద్యోగాలు కల్పించాలని, సొంతింటి పథకాన్ని అమలు చేయాలని, పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు.

అలాగే కొత్త గనులు ప్రారంభించడంతో పాటు ఓపెన్‌కాస్ట్ గనుల్లో ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేయాలని, అండర్‌గ్రౌండ్ గనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాలు, విడిభాగాలు అందుబాటులో ఉంచాలని, 2003 ఒప్పందం ప్రకారం బొగ్గు ఉత్పత్తిని శాశ్వత కార్మికులతోనే నిర్వహించాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను ప్రకటించి అందులో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా 150/200 మస్టర్ రెగ్యులేషన్‌కు సంబంధించిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని, మైనింగ్, ఈఅండ్‌ఎం క్యాడర్ సమస్యలను పరిష్కరించాలని, విధుల నుంచి తొలగించిన కార్మికులకు ఒకసారి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు.సమ్మె నోటీసు గడువులోపు గుర్తింపు సంఘంతో యాజమాన్యం చర్చలు జరిపి సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలని, లేకుంటే కార్మిక సంఘాలన్నింటినీ కలుపుకొని జూన్ 22 తర్వాత సమ్మెకు పిలుపునిస్తామని కొరిమి రాజ్‌కుమార్ స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గుర్తింపు పొందిన కార్మిక సంఘాలను పక్కనబెట్టి రాజకీయ జోక్యంతో సింగరేణిని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేశారని ఆయన ఆరోపించారు. కొత్త యంత్రాలు, విడిభాగాల కొనుగోలుకు నిధులు లేవని యాజమాన్యం చెబుతోందని, భవిష్యత్తులో కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో రాజకీయ జోక్యం కారణంగా సింగరేణి సంస్థ నిర్వీర్యమవుతోందని విమర్శించారు. ఇప్పటికైనా యాజమాన్యం రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించి సంస్థను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వై.వి.రావు, కేంద్ర కార్యదర్శులు కవ్వంపల్లి స్వామి, జూపాక రాంచందర్, బ్రాంచి కార్యదర్శులు రంగు శ్రీను, గంధం సాంబశివరావు, నాయకులు గండి ప్రసాద్, అటికేటి రాజు, రంజిత్, చేరాలు, రామస్వామి, సమ్మయ్య, రమేశ్ గౌడ్, నల్ల మహేష్, జీవన్, కార్యాలయ కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**ప్రజలకు అవగాహన కల్పించిన డి ఎస్పీ సై రెడ్డి వెంకట్ రెడ్డి సిఐ నాగార్జున ఎస్ఐ కురుమూర్తి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



కల్వకుర్తి మండలంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఎస్పి సై రెడ్డి వెంకట్ రెడ్డి, సిఐ నాగార్జున, ఎస్పై కురుమూర్తి, పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గ్రామస్తులకు రోడ్డు భద్రత మరియు మాదకద్రవ్యాల పైన అవగాహన కల్పించడం జరిగింది ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి సీఐ,ఎస్ఐ కురుమూర్తి మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ నాయకులు మరియు ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ముఖ్య మంత్రి సభకు బయలుదేరిన వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



తలకొండ పల్లి మండలశీ లోని వెల్జాల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఫ్యూచర్ సిటీ బహిరంగ సభకు బయలుదేరిన వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు రంగారెడ్డి జిల్లా కందుకూరు దగ్గర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించే ఫ్యూచర్ సిటీ అనంతరం జరిగే బహిరంగ సభకు బయలుదేరిన వెల్జాల్ మరియు వెంకటాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళా సంఘల సభ్యులు ఈ కార్యక్రమంలో వెల్జాల్ మాజీ ఉప సర్పంచ్ అజీజ్ నాయకులు పబ్బతి వెంకటయ్య, వద్దే రాజు, బాద్రముని అనిల్ కుమార్ ముదిరాజ్, లింగం యాదవ్, కరీం షా ఖాద్రి, సొప్పరి శ్రీను, ముదిగొండ లక్ష్మయ్య మహిళా సంఘం నాయకురాలు కృష్ణవేణి,కల్పన, శ్రీవాణి, రాణి, గన్నోజు రమాదేవి, చిలకం జయమ్మ ,సువర్ణ ,సత్యమ్మ,తదితరులు బయలుదేరారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:**

ఈరోజు మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజలు యువకులు అందరితో సమావేశం ఏర్పాటు చేసి బడిబాట కార్యక్రమం గురించి మాట్లాడడం జరిగింది. బడిబాట కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ మన గ్రామం నుంచి ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలకు ఒక విద్యార్థి కూడా వెళ్లకూడదని, ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సదుపాయాలు అన్నిటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము. గ్రామస్తులు కూడా సానుకూలంగా స్పందిస్తూ ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల బస్సులను మన గ్రామానికి రానివ్వమని పిల్లలందరినీ స్థానిక ప్రాథమిక పాఠశాలలోనే అడ్మిషన్ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మన పాఠశాలను అందరం సమన్వయంతో పని చేస్తూ ప్రగతి పథంలో నడిపిద్దామని ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణదేవి, మరియు ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, కె.వెంకటయ్య మాట్లాడడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్లకాడి చిన్న నర్సయ్య, గ్రామ పెద్దలు దాసరి రాములు, పవన్ కుమార్ నారాయణ గౌడ్ దస్తయ్య వెంకటయ్య శాంతయ్య రవి లింగాయపల్లి రాములు కేశవులు అంజి రాజు మైబు గొడుగు రాములు పూజా శిరీష అనిత చేన్నమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యాన్ని ఖుని చేసుతున్న బీజేపీ ప్రభుత్వం

**తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను సాంకేతిక కారణాల సాకుతో తిరస్కరించడం కేవలం ఒక వ్యక్తికి జరిగిన అన్యాయం కాదు; ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి, రాజ్యాంగ విలువలకు పూర్తిగా విరుద్ధం.అని తలకొండ పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.విపక్షాల గొంతు నొక్కడమే ధ్యేయంగా పెట్టుకున్న బీజేపీ, వ్యవస్థలను తన చేతుల్లోకి తీసుకుని నడుపుతోంది.ఈ నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ రాజకీయ కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల బరిలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేక, ఇలాంటి తెరవెనుక కుతంత్రాలతో కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవాలని చూడడం బీజేపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కట్టుబడి ఉంది.ఇలాంటి బెదిరింపులకు, కుట్రలకు మా పార్టీ భయపడబోదు.మీనాక్షి నటరాజన్ నిఖార్సైన కాంగ్రెస్ వాది, తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఆమె అందించిన సేవలు, పార్టీ పట్ల ఆమెకున్న నిబద్ధత అమోఘం. ఆమె గొంతును చట్టసభల్లో వినపడకుండా చేయాలని చూస్తే,దేశవ్యాప్తంగా లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఆమెకు అండగా నిలబడతారు. వ్యవస్థలను అడ్డుపెట్టుకుని బీజేపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రజల పక్షాన నిలబడి పోరాడే కాంగ్రెస్ పార్టీ సంకల్పాన్ని ఎవరూ బలహీనపరచలేరు.

రాజ్యాంగ సంస్థలను అధికార పార్టీ తన స్వార్థానికి వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటు.ఈ అప్రజాస్వామిక చర్యను దేశంలోని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాల్సిన అవసరం ఉంది. ?న్యాయం, ధర్మం ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటాయి. బీజేపీ చేస్తున్న ఈ కుట్రలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు, తగిన సమయంలో వారు ఖచ్చితంగా బుద్ధి చెప్తారు అని దోకూరి ప్రభాకర్ రెడ్డి అన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**



బుధవారం కమాన్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో కమాన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గాండ్ల మోహన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్ కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుపై మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులపై రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించకుండా వ్యక్తిగత ఆరోపణలకు దిగడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని పొందిన నాయకులపై అసత్య ప్రచారాలు చేసినంత మాత్రాన వాస్తవాలు మారవని, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం మరింత బలంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు.పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుపై పుట్ట మధు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న నాయకులపై ఆధారాలు లేని విమర్శలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. మంథని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు వాస్తవాలను గుర్తిస్తున్నారని, వ్యక్తిగత ఆరోపణల కంటే ప్రజా సమస్యలపై మాట్లాడితే మంచిదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఎలాంటి దుష్ప్రచారం చేసినా ప్రజల మద్దతు తగ్గదని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కమాన్పూర్ మత్స్యశాఖ చైర్మన్ గడప కృష్ణమూర్తి మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాజీ ఎంపీటీసీ శివ శంకరయ్య మల్యాల మహేష్ గౌడ్, సిద్ది పల్లె ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, ఏం సి డైరెక్టర్ దాసరి గట్టయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చాట్ల గట్టయ్య, వెంగలి రాజయ్య గౌడ్, నగునూరి నరసయ్య గౌడ్, ఇనగంటి ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలి

**రైతులకు వ్యవసాయ శాఖ సూచనలపై అవగాహన**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండల కేంద్రంలోని నిర్వహించిన ప్రత్యేక గ్రామసభ సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి ఎంవోఎ వసంతరావు ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి పాల్గొని రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి ఆరోగ్య పరిరక్షణకు సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు. పశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువుల వాడకం వల్ల నేల సారం పెరగడంతో పాటు పంటల నాణ్యత మెరుగుపడుతుందని తెలిపారు. వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులు సన్న వరి రకాల సాగును విస్తరించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఆర్ యన్ ఆర్ -15048, ఆర్ యన్ ఆర్ -29325 హెచ్ ఎం టి సన్న, ఎం టి యు -1224, కె యం యూ -1638, గడబ్ల్యూ జి ఎల్ 44, డబ్ల్యూ జి ఎల్ -962, జె జి ఎల్ -24423, బి పి టి -5204 వంటి సన్న వరి రకాలను సాగు చేసి మార్కెట్లో అధిక గిరాకీ, మెరుగైన ధరలు పొందవచ్చని వివరించారు. సన్న వరి విక్రయించే రైతులకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ కూడా అందజేస్తున్నట్లు తెలిపారు.అలాగే పంటల వైవిధ్యీకరణలో భాగంగా కంది, పెసర, మినుములు, అలసందలు వంటి పప్పుధాన్యాలు, జొన్న, సజ్జ, రాగి వంటి చిరుధాన్యాలు, నువ్వులు, వేరుశెనగ, సోయాబీన్, పొద్దుతిరుగుడు వంటి నూనెగింజల పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. దీర్ఘకాలిక ఆదాయం కోసం ఆయిల్‌పామ్ సాగు కూడా లాభదాయకమని వివరించారు.యాసంగి పంట కోత అనంతరం వరి, మొక్కజొన్న పంట అవశేషాలను కాల్చివేయడం వల్ల నేల సారం తగ్గిపోవడం, ఉపయోగకర సూక్ష్మజీవులు నశించడం, గాలి కాలుష్యం పెరగడం, వాతావరణ మార్పులకు దోహదం కావడం వంటి తీవ్ర దుష్పరిణామాలు కలుగుతాయని తెలిపారు. రైతులు పంట అవశేషాలను కాల్చకుండా మల్చింగ్ లేదా భూమిలో కలియ దున్నడం వంటి పద్ధతుల ద్వారా భూమిలో కలపాలని సూచించారు. ఎల్‌నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వాతావరణ ఆధారిత పంటల ప్రణాళికను అవలంబించాలని, తక్కువ నీటి అవసరం ఉన్న పంటల సాగుపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. అలాగే యూరియా, డీఏపీ ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించడం, నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించడం, సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో ఏవో ఉప సర్పంచ్ మచ్చ గణేష్ గ్రామ బి ఆర్ యస్ శాఖ అధ్యక్షులు బుద్ధ నాగరాజు మాజీ ఎంపీటీసీ కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి ఇమ్మడి శివ లక్ష్మి జహంగీర్ వార్డు సభ్యులు బచ్చలి భాస్కర్ ఎండీ ఇస్మాయిల్ బత్తిని శ్రీనివాస్ డప్పు సంధ్య సాయికుమర్ శ్రీలత రాంచంద్రం దండే వెంకటేష్ మచ్చ బాబు తాటిపాముల ఆంజినేయులు మధుసూదన్ రెడ్డి రాగుల మల్లేశం బాల్ నర్సయ్య కొంపల్లి నర్సింలు అమర రాము ఎండీ అజిజ్ గాల్ రెడ్డి అబ్బు కందుల బాల్ రాజు నర్సిములు కొరమైన యాదగిరి మచ్చ వెంకటేష్ ఆశ వర్కర్స్ అంగన్వాడీ టీచర్స్ రైతులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

**పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి..**

**పట్టణ కౌన్సిలర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలి..**

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..**

**కోట్ల రూపాయలను వెచ్చించి పెద్దపల్లి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం..**

**పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలి..**

**రూ. 7 కోట్లతో పట్టణ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్..**

**ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి టౌన్**

బుధవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశం ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్, నూగిళ్ల మల్లయ్య స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశ్యుద్ధం, త్రాగు నీరు, వీధి దీపాలు, సీజనల్ వ్యాధులు, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర అంశాలపై మున్సిపల్ అధికారులతో కలిసి ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు . చింతకుంట విజయరమణ రావు సమీక్షించారు.



**ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ..**

మున్సిపల్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశ్యుద్ధంపై దృష్టి సారించాలని అన్నారు.పట్టణ కౌన్సిలర్లు నిత్యం ప్రజల మధ్య ఉంటూ వార్డుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. పెద్దపల్లి పట్టణంలో బీటీ రోడ్డు, సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్లు, మంచి నీటి ట్యాంకుల నిర్మాణాలు, రూ. 7 కోట్లతో నూతన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, అమృత్ 2.ా పతకం, మరుగుదొడ్ల అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వాటన్నింటినీ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రానున్న కొద్ది రోజుల్లో పట్టణంలో వార్డు వార్డున క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని తెలిపారు. ప్రతి వార్డులో పారిశ్యుద్ధం మరింత మెరుగు పరిచేలా కమిషనర్ చైర్మన్ చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా వాటిని పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్యం చేసే దిశగా అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు చూడాలని కోరారు. పట్టణంలో దాదాపు 77 కోట్ల పై చిలుకు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల ట్రస్ట్ ద్వారా నిరుపేదల కుటుంబ ఇంటి నిర్మాణానికి చేయూత



**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల కేంద్రము లోని పోతు గంటి పెంటయ్య నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో వారు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం తో స్థానిక నాయకుల తో కలిసి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ నీ మర్యాద పూర్వకంగా కలవడంతో వెంటనే స్పందించి నిర్మాణంలో భాగంగా ప్రతి పేదోడి సొంత ఇంటి కల నెరవేర్చలానే సంకల్పంతో వారి ఇంటికి సరిపడ సీకులు ఇప్పించడం జరిగింది. సిమెంట్ కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు కార్యకమంలో, గ్రామ సర్పంచ్ కటికెల శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్ ముదిరాజ్, వార్డు సభ్యులు పోతుగంటి కుమార్, మల్లీశ్వరి జంగయ్య, వెంకటేష్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:**

ఈరోజు మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు గ్రామ సర్పంచ్ గ్రామ ప్రజలు యువకులు అందరితో సమావేశం ఏర్పాటు చేసి బడిబాట కార్యక్రమం గురించి మాట్లాడడం జరిగింది. బడిబాట కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ మన గ్రామం నుంచి ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలకు ఒక విద్యార్థి కూడా వెళ్లకూడదని, ప్రభుత్వం కల్పిస్తున్నటువంటి సదుపాయాలు అన్నిటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము. గ్రామస్తులు కూడా సానుకూలంగా స్పందిస్తూ ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల బస్సులను మన గ్రామానికి రానివ్వమని పిల్లలందరినీ స్థానిక ప్రాథమిక పాఠశాలలోనే అడ్మిషన్ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. మన పాఠశాలను అందరం సమన్వయంతో పని చేస్తూ ప్రగతి పథంలో నడిపిద్దామని ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణదేవి, మరియు ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, కె.వెంకటయ్య మాట్లాడడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్లకాడి చిన్న నర్సయ్య, గ్రామ పెద్దలు దాసరి రాములు, పవన్ కుమార్ నారాయణ గౌడ్ దస్తయ్య వెంకటయ్య శాంతయ్య రవి లింగాయపల్లి రాములు కేశవులు అంజి రాజు మైబు గొడుగు రాములు పూజా శిరీష అనిత చేన్నమ్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**అధ్యక్షత వహించిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలను గుర్తించి వారికి అండగా ఉంటామని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేసి 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీడీఓ కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి గిరి,పశు వైద్యాధికారి డాక్టర్ వనజా, ఎఎస్ఐ శ్రీనివాస్, పంచాయతీ రాజ్ అధికారి సురేందర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ పల్లవి, అగ్రికల్చర్ ఏఈఓ రాజ్ కుమార్, ఆర్ డబ్లుఅస్ మండల అధికారి ప్రవీణ్, విద్యుత్ శాఖ ఏఈ వెంకటేష్, ఎచ్ఎం సుగుణ, ఈజి ఎస్ ఈశ్వర్ జీ, వార్డు సభ్యులు వాణి పురుషోత్తం, మల్లీశ్వరి రంగనాథం, కవిత రమేష్, వెంకటేష్, దేవేందర్, రమేష్,మానస రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని విమర్శించే అర్హత పుట్ట మధుకు లేదు

**అగ్నిధార న్యూస్ పెద్దపల్లి**

రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుపై వ్యక్తిగతంగా, అమర్యాదకరంగా మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు సహించబోరని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కోఆర్డినేటర్ కమ్మగోని చౌదరి గౌడ్ హెచ్చరించారు. బుధవారం పెద్దపల్లిలో చౌదరి గౌడ్ మాట్లాడుతూ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తన రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధిపై మాట్లాడలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. శ్రీధర్ బాబు గురించి మాట్లాడే అర్హత పుట్ట మధుకు లేదన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడిపై బురదజల్లడం ఆయన రాజకీయ బలహీనతకు నిదర్శనమని, ప్రజల మద్దతు కోల్పోయిన నాయకులు ఇప్పుడు ఆరోపణలతోనే వార్తల్లో నిలవాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో ప్రజలు పలుమార్లు తిరస్కరించినప్పటికీ అదే అహంకార ధోరణితో వ్యవహరించడం పుట్ట మధు రాజకీయ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇకపై శ్రీధర్ బాబుపై వ్యక్తిగత దూషణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఊరుకోబోమని, ప్రజల మధ్యనే గట్టి రాజకీయ సమాధానం ఇస్తామని హెచ్చరించారు. పుట్ట మధు హద్దులు దాటి వ్యవహరిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని చౌదరి గౌడ్ స్పష్టం చేశారు.

# సీజినల్ వ్యాధుల పై అవగాహన కార్యక్రమం

**సర్పంచ్ లింగాల మౌనిక ముత్యం**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వెల్ నియోజకవర్గం జగదేవపూర్ మాందాపూర్ గ్రామంలో గ్రామ సభ సర్పంచ్ లింగాల మౌనిక ముత్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధికారి ఎంపీవో కాజా మొయినోదిన్ జీపీవో శంకర్ హాజరై సీజనల్ వ్యాధుల పై సూచనలు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల గురించి వాటర్. తడి చెత్త పొడి చెత్త నిర్వహణ శానిటరీ చెత్త ప్రమాదకరమైన వస్తువుల పైన గ్రామస్తులకు వివరణ చేయడం పాడైన వస్తువులు ఇండ్లలో నిల్వ చెయ్యకూడదని అన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సెక్రెటరీ సాయిబాబా. ఉపసర్పంచ్ నర్రా రాములు వార్డు సభ్యులు. లింగాల గణేష్. పార్వతి కనకమ్మ.నవీన్.సురేష్. హేమలత. రాములమ్మ.గ్రామస్తులు పాల్గొన్నారు .

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com